ENTERED
Entered

హ్యాపీ బర్త్‌డే

(2010నవంబర్ 7 నుంచి 2010 నవంబర్ 13 వరకు)

కె.మనోజ్ఞ మహాదేవి
నవంబర్13
పల్లవి-మోహన్
పెద్దతుంబళం-ఆదోని

పి.రుక్మిణి లహరి
నవంబర్8
రత్న-చక్రి
హైదరాబాద్

సురేష్
నవంబర్9
మణి-మహాలక్ష్మినాయుడు
హరిపాలెం-విశాఖ

వి.వరిమళ
నవంబర్9
సునీత-రవి
నిజాంపేట-ఖమ్మం

కావ్యశ్రీ
నవంబర్
నాగమణి-జంగయ్య
కనగల్లు-నల్లగొండ

ఒ.వెంకటేష్
నవంబర్8
ఆదిలక్ష్మి-తిరుపతిరావు
పామూరు-ప్రకాశం

జె.నవృతిక
నవంబర్7
స్వర్ణమాల-కుమారస్వామి
బాగ్‌లింగంపల్లి

ఎల్.భారతి
నవంబర్
అరుణకుమారి-శ్రీను
మునగపాక-విశాఖ

లక్ష్మిప్రసన్న
నవంబర్
అరుణకుమారి-శ్రీను
మునగపాక-విశాఖ

ENTERED

మనలో మాట

చలి పులి

చలి పులి విహారానికి వేళయింది. ఆవులిస్తూ ఒళ్లు విరుచుకొంటోంది. ఆత్మరక్షణకు జనమూ సన్నద్ధమవుతున్నారు. బీరువాల్లో మూలన పడున్న చలిబన్నీలు, రగ్గులు, మఫ్లర్లు, మందపాటి దుప్పట్లు మెల్లమెల్లగా బయటికొస్తున్నాయి. రాత్రుళ్లు వీధులు వెలవెలపోతున్నాయి. ఉదయం వాహ్యాళికి వచ్చేవారి సంఖ్య క్రమంగా సన్నగిల్లుతోంది. పార్కులు బోసిపోతున్నాయి. రోడ్లే రాజమహళ్లుగా బతికేవారు ... ఏ మూలనో ముడుచుకొని ... ఎప్పుడెప్పుడు తెల్లారుతుందా అని ఎదురుచూస్తుంటారు. పల్లెల్లో చీకటవగానే దుప్పట్లు ఒంటికి చుట్టుకొని పనులు పూర్తిచేస్తుంటారు. వెచ్చగా చలిమంటల చుట్టూ కూర్చుని కబుర్లాడుకుంటారు.

పొద్దుటే పొగలు కక్కే కాఫీ కప్పు అందించేవారుంటే చలికాలపు ఉదయం ఉల్లాసమే. వేణ్ణీళ్లతో స్నానం చేయగలిగితే విలాసమే. కూసింత పొద్దు కుంగాక మిర్చీబజ్జీల వ్యాపారం జోరందుకొంటుంది. చలికి కాసిని చినుకులు కూడా తోడైతే చిరుతిళ్ల వ్యాపారుల పంట పండినట్లే. శీతల వరం సీతాఫలం అమృతమే! కవి సమ్మేళనాలకు ప్రశస్తమైన రుతువిదే. నిర్వాహకులు కప్పే శాలువాలకు అర్థం, పరమార్థం లభించేది ఇప్పడే కదా. చలికాలమంటే సెమినార్ల కాలం కూడా.

నిన్నటిదాకా నిర్విరామంగా పనిచేసి అలసిసొలసిన ఫ్యాన్లకు విశ్రాంతి లభించేది ఇప్పడే. గ్యాసు బండ ఏక్షణాన ఖాళీ అవుతుందోనని ఇల్లాలు కంగారుపడేదీ ఇప్పడే. లీవులు మురిగిపోకుండా ఎప్పుడెప్పుడు సెలవులు పెట్టేద్దామా అని సగటు ఉద్యోగుల ఆరాటం. సెలవులు లెక్కకట్టిమరీ మునివేళ్లమీద కూర్చుంటారు. బాస్ ఎప్పుడు అనుమతిస్తే అప్పుడు చెక్కేద్దామని. అదేదో సినిమాలో బ్రహ్మానందం చెప్పినట్టు అన్నింటికంటే కష్టం లీవులివ్వడం...ఇది బాసుల గొడవ.

టీవీ చూసినా, పత్రికలు తిరగేసినా ఒకటే ప్రకటనల జోరు. తమ కంపెనీ క్రీములు, గ్లిజరిన్ సబ్బులు కొనమని హోరెత్తిస్తుంటారు. ముఖ్యమైన రోడ్లపైన నేపాలీలు, టిబెటన్ల స్వెటర్ల షాపులు ఆకట్టుకుంటుంటాయి. పైసలున్నోళ్లు ఏవైనా కొంటారు. వాడతారు. చలిపులి నుంచి కాచుకొంటారు. కాకపోతే పేదోడికే చలిపులంటే హడల్.

★

ఈ సంచికలో....

టపా	...	2
రుచి	...	3
వికాసం	...	6
కవిత్వమ్	...	8
కొత్త పుస్తకాలు	...	9
సీరియల్	...	10
చూద్దామా	...	12
అట్టమీది కథ	...	14
కథ	...	18
బాలనేస్తాలు	...	22
మాటలకోట	...	24

ఇంకా...

స్ఫూర్తి ... 4

హృదయాన్ని సానపట్టిన పుస్తకాలు

... 7

కుటుంబమంతా ఆర్చరీకే అంకితం...

ఈ పేజీ ... 20



బ్లాగింగ్ బాతాఖానీ...



కంటతడి పెట్టించిన 'గనిలో పని...'

'గనిలో పని దినదిన గండం' అట్టమీది కథ కంట నీరు తెప్పించింది. పేదరికాన్ని వ్యాపారంగా మార్చుకొని వాళ్ళ జీవితాలతో ఆడుకోవడం నీచం. ప్రపంచ దేశాలకు ఇది సిగ్గుచేటు. మల్లె మనసు కథ బాగుంది. స్ఫూర్తి ప్రదాత సి.ఆర్.రావు గురించి తెలుసుకోగలిగాం.

బి. మోతి మోహనరంగా,
సూర్యాపేట్.

పరిమళించిన 'మల్లె మనసు'

అక్టోబర్ 24, ఆదివారం అనుబంధంలో మల్లె మనసు కథ మమ్మల్ని ఎంతగానో ఆకట్టుకుంది. రచయితకు ప్రత్యేక అభినందనలు. 'మల్లెలకు లేని మలినం ఈ మనుషులకు ఎందుకు?' అన్న వాక్యం అద్భుతంగా వుంది. వారం వారం మంచి కథల్ని అందిస్తున్న ఎడిటర్ గారికి ధన్యవాదాలు.

గాజుల రామకృష్ణ, ప్రగతి నగర్,
హైద్రాబాద్.

కదిలించిన గనిలో పని

స్నేహ..అట్టమీదికథ 'గనిలో పని' కథనం మమ్మల్ని కదిలింపజేసింది. మల్లెమనసు కథ బావుంది. "బుల్లి ప్రపంచం" చిత్రావళి గమ్మత్తుగా ఉంది. "కొత్త పుస్తకాలు" శీర్షిక ద్వారా ఎప్పటికప్పుడు కొత్తపుస్తక సమాచారం అందుతోంది. 'ఇ వ్యర్థాలతో అనర్థం' ఆలోచనాత్మకంగా ఉంది. పిల్లలు అబద్దాలు ఆడకూడదంటే పెద్దలు అబద్ధాలాడడం మానాలన్న స్పృహ కలిగించిన 'వికాసం' సదా ఆచరణీయం. నేటి కవి సమ్మేళనాల స్థితి – దుస్థితిని ఆశారాజు భలే ఏకరువు పెట్టారు. బాలనేస్తాలు పేజీ సరదాగా ఉంది. మాటలకోటకు సమాధానాలను పాఠకుల నుండి ఆహ్వానించి కరెక్టుగా రాసిన కొందరి పేర్లు ప్రచురించండి. కులదీప్ నయ్యర్ ద జడ్జిమెంట్ ఎంతటి ఉత్కృష్టమైనదో ప్రొ॥ నాగేశ్వర్ గారి 'స్ఫూర్తి' ద్వారా తెలుసుకున్నాం. మనలో మాట ఇంటి భాగోతం బాగానే ఉంది. ఇక అమలు చేయటమే తరువాయి. దీనితోపాటు, మిగతా సి.ఎమ్.లు కూడా వెస్ట్‌బెంగాల్ సి.ఎమ్ అడుగుజాడల్లో నడిస్తే బెటర్.

నేమాన సుభాష్ చంద్రబోస్,
ఇలిసిపురం, శ్రీకాకుళం.

ఇ వ్యర్థాలు అనర్థదాయకమైనవే

కవర్‌స్టోరీ "గనిలో పని దిన దిన గండం" వాస్తవికంగా వుంది. శ్రమజీవుల కష్టం గురించి, అభిప్రాయం గురించి అందరూ ఆలోచించాలి. ఏ గనులలోను సంపూర్ణ రక్షణ వ్యవస్థలేదు. మన దేశంలో ప్రైవేటు సెక్టార్‌లో ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇ వ్యర్థాలతో అనర్థం వ్యాసం బాగుంది. ఇ వ్యర్థ పదార్థాల నియంత్రణకు చేసిన చట్టాన్ని అమలు చేయాలని కోరుకుంటున్నాం.

టి. శ్రీరామమూర్తి, గాజువాక,

జొన్న వంటలు ఇవ్వొచ్చుగా

మనలో మాట 'ఇల్లు' ఎంతో బావుంది. పేదలు నీడనిచ్చే ఇళ్లు లేక చస్తోంటే ధనవంతులు అత్యంత వైభవంగా భవనాలు కట్టుకుంటున్నారు. ప్రొ.కె.నాగేశ్వర్‌కి స్ఫూర్తి కలిగించిన జడ్జిమెంట్ పుస్తక పరిచయం బావుంది. మల్లె మనసు కథ చాలా బాగుంది. కూటి కోసం కోటి పాట్లు అన్నట్టుంది పూలు అమ్ముకొనే యువతి పరిస్థితి. కవిత్వమ్ పేజీలో నాలుగు కవితలు ఎంతో బాగున్నాయి. చికెన్ మంచూరియా, నూడుల్స్ లాంటి వంటలు కాకుండా సమాన్య ప్రజానీకం అందరికి ఉపయోగపడే విధంగా జొన్నలు, రాగులతో ఎలాంటి వెరైటీలు తయారు చేసుకోవచ్చో తెలియచేయండి. బాలనేస్తాలు పేజీలు మరింత బాగున్నాయి. 'ఒక్క క్షణం ఆలోచించండి' కథ చిన్నదే అయినా అందించిన సందేశం పెద్దది. చూద్దామాలో మూడు రాష్ట్రాల సరిహద్దులు గురించి ఇచ్చిన సమాచారం బాగుంది.

మార్టూరు అజయ్ కుమార్,
చిలకలూరిపేట, గుంటూరు.

అసహజ ముగింపు

ప్రపంచంలో ఏడాదికి 4 కోట్లు టన్నుల ఇ వ్యర్థాలు ఉత్పన్నం అవుతున్నాయని చదివి విస్తుపోయాను.ప్రొ॥ కె. నాగేశ్వర్ ఎమర్జన్సీ నిర్బంధ కాలంలో రాజకీయాలు నేర్చుకొన్నారు. అందువల్లనే ఈనాటికీ వామపక్ష భావాలతో వున్నారు. కథ చిన్నదైనా,



సందేశం పెద్దదని ఒక్కక్షణం ఆలోచించితే గ్రహించగలము. చెట్టు సంతోషాన్ని దుఃఖాన్నీ చక్కగ మనస్సుకు హత్తుకొనేలా రమేష్‌బాబు రాశారు. గనిలోని ఖనిజాలకంటే ఆ పనికి వెళ్లిన కార్మిక శ్రమ విలువ ఎక్కువని అట్టమీద కథ ద్వారా తెలుసుకొన్నాను. పూలమ్మే ఆడమనిషి కాళ్లమీద పడడము, కథకుడు ఆమెను చెల్లెలని, తన భార్య ఆమెకు వదినని వరసలు కట్టడం అసహజంగా వుంది. పూలమ్మే మనిషి వ్యాపారరీత్యాను, మనుషులకు అనుకూలంగాను మారడము కథకు మలుపు.

ఇలిపిళ్ళ సూర్యనారాయణ,
భీమనవారిపేట, విజయవాడ.

'బాలాజీ' ఎంత బరువో!



శ్రీ వెంకటేశ్వరా జూలాజికల్ పార్క్ నిర్వాహకులు ఇప్పుడు ఆనంద డోలికల్లో తేలిపోతున్నారు. మరి తమ పార్క్‌లో పులి త్వరలో గిన్నిస్ బుక్ ఎక్కనుంది. అదేమైనా చిన్నవిషయమా! అందుకే అంత ఆనందం. అసలు విషయానికొద్దాం. జూపార్క్‌లో 'బాలాజీ' అనే పులి వుంది. దానికిప్పుడు 16 ఏళ్లు. మామూలుగా ఇంత వయసు పులులు 70 కేజీల బరువుంటాయి. కానీ మన బాలాజీ బరువు మాత్రం సింపుల్‌గా 139 కేజీలు. తమాషా ఏంటంటే... 1996లో జూ అధికారులకు బాలాజీ దొరికినపుడే 108 కేజీల బరువుంది. అదెలా సాధ్యం? జన్యుపరమైన సమస్యల వల్ల ఇంత బరువైందా? లేక ఆహారం అతిగా తీసుకోవడం వల్ల అలా అయ్యిందా? అన్న అనుమానం వస్తుంది ఎవరికైనా. బాలాజీ అంత బరువుండడానికి అవేవీ కారణాలు కావని జూ నిర్వాహకులు సెలవిస్తున్నారు. మరో ఏడాది రెండేళ్లపాటు ఆరోగ్యంగా జీవించగలదని కూడా చెప్తున్నారు. బాలాజీ మామూలుగా ఇతర పులులు తిన్నంత ఆహారమే తీసుకొంటుంది. అంటే 4 కేజీల మాంసం మాత్రమే తింటుంది. అంతేకాదు! దానికి ఇతరత్రా ఆరోగ్య సమస్యలు కూడా ఏవీ లేవు. ఆసక్తికరమైన విషయమేంటంటే.... బరువైన పులిగా బాలాజీ పేరును గిన్నిస్ బుక్‌లో ఎక్కించే పనిలో అధికారులు బిజీగా వున్నారు.

టొమేటో సూప్

కావాల్సిన పదార్థాలు

పండు టొమేటోలు-250 గ్రాములు
క్యారెట్ తురుము- అరముక్క
ఉల్లిపాయ-1, వెన్న - ఒక టేబుల్ స్పూన్
నీరు - 3 కప్పులు, టొమేటో సాస్ - అరకప్పు
పంచదార, ఉప్పు - రుచికి తగినంత

తయారుచేసే పద్ధతి

టొమేటోలు, క్యారెట్, ఉల్లిపాయ పెద్ద ముక్కలు కట్ చేసుకోవాలి. మందపాటి పాత్రలో వెన్న వేసి సన్నటి సెగపై కాయాలి. వెన్న కరిగి నెయ్యిగా మారకముందే కూరగాయ ముక్కలన్నీ వేసి కలపాలి. మూడు కప్పుల నీరు పోసి ఉడికించాలి. పేస్టు మాదిరి తయారుచేసి వడకట్టాలి. వేడిచేసి, టొమేటో సాస్, పంచదార, ఉప్పు కలిపి సర్వ్ చేయాలి.

క్రీమీ పొటాటో సూప్

కావాల్సిన పదార్థాలు

వెన్న -రెండు టేబుల్ స్పూన్లు
బంగాళదుంపలు - నాలుగు
ఉప్పు -రుచికి తగినంత, పాలు - ఒక కప్పు
ఒక గుడ్డులోని పచ్చసొన

తయారుచేసే పద్ధతి

రెండు టేబుల్‌స్పూన్ల వెన్నను వెడల్పాటి పాత్రలో కాయాలి. బంగాళదుంపల ముక్కలు వేసి, చాలినంత నీరు పోసి మూత పెట్టాలి. ఓ మాదిరి సెగపై బంగాళదుంపల ముక్కలు మెత్తబడేదాకా ఉడికించాలి. ఈ మిశ్రమాన్ని బ్లెండ్ చేసి పాలు పోయాలి. ఇంకొంత నీరు పోసి కావాల్సిన చిక్కదనంతో తయారు చేసుకోవాలి.

అర కప్పు బంగాళదుంపల సూప్ మిశ్రమంలో గుడ్డు పచ్చసొన కలపాలి. దీనిని తిరిగి మిగతా మిశ్రమానికి జతచేర్చాలి. రుచి చూసి, తాలింపు వేసి, కొద్ది నిమిషాలు మరిగించి ఒక టేబుల్ స్పూన్ వెన్న కలిపి వేడిగా వడ్డించాలి.

నిమ్మ, కొత్తిమీర సూప్

కావాల్సిన పదార్థాలు

కార్న్‌ఫ్లోర్ -మూడు టీస్పూన్లు
అల్లంముక్క - రెండంగుళాలు
వెల్లుల్లి రేకలు - రెండు
నిమ్మకాయ - 1, కొత్తిమీర కట్ట - 1
నీళ్లు - పావులీటరు, ఉప్పు - రెండు టీస్పూన్లు

వేడి వేడి సూప్

వెచ్చగా గొంతు దిగే సూప్‌లు హాయిగా వుండడమే కాదు ఆరోగ్యాన్నీ ఇస్తాయి. మాంసం, కూరగాయల రసాలతో తయారయ్యేదాన్ని సూప్ అంటారు. వీటిని ఉడికించిన నీటితో సూప్‌లు తయారుచేస్తారు. వర్షాకాలంలో సూప్‌లు తాగడానికి బావుంటాయి. పోషకాలూ అందిస్తాయి.

తయారు చేసే పద్ధతి

పాత్రలో నీరు పోసి వెల్లుల్లి, అల్లం ముక్కలు, కొత్తిమీర కాడలు వేసి ఉడికించాలి. కార్న్‌ఫ్లోర్‌ను కొద్దిగా నీటిలో కలిపి జత చేర్చి, ఇంకొద్దిసేపు ఉంచి, ఉప్పు, మిరియాలపొడి కలపాలి.

క్లియర్ వెజిటబుల్ సూప్

కావాల్సిన పదార్థాలు

క్యారెట్లు - 3
క్యాబేజి ముక్కలు - ఒక కప్పు
క్రీమ్ - ఒక టేబుల్ స్పూన్
వెన్న - కొద్దిగా
ఉప్పు - రుచికి తగినంత
మిరియాల పొడి - కొద్దిగా
గిలకొట్టిన క్రీమ్ - మూడు టేబుల్ స్పూన్లు
బఠాణీలు - పావు కప్పు
కొద్దిగా పుదీనా

తయారు చేసే పద్ధతి

ఒక టేబుల్ స్పూన్ వరకు క్యారెట్ తురిమి పక్కన వుంచుకోవాలి. క్యాబేజి కూడా సన్నగా తరగాలి. మిగతా క్యారెట్లును మెత్తగా ఉడికించాలి. చల్లారనిచ్చి బ్లెండ్‌చేసి వడకట్టుకోవాలి.

క్యారెట్ తురుము, క్యాబేజి ముక్కలు, ఉప్పు కలిపి మరో గిన్నెలోకి మార్చుకోవాలి. క్రీమ్, మిరియాల పొడి, పుదీనా ఆకులు వేసి వెచ్చగా తాగాలి.

మిక్స్‌డ్ వెజిటబుల్ సూప్

కావాల్సిన పదార్థాలు

నీళ్లు లేదా వెజిటబుల్ స్టాక్ - 5-6 కప్పులు
చిన్న బంగాళదుంపలు - నాలుగు
ఉల్లిపాయలు - రెండు
క్యారెట్లు - రెండు, బీన్స్ - పావు కప్పు
టొమేటోలు - మూడు
లవంగం - 1
బఠాణి గింజలు - 2స్పూన్లు
ఉప్పు - అర టీస్పూన్
వెన్న - అర టీ స్పూన్
ఛీజ్ తురుము - ఒక టీ స్పూన్
4 టీ స్పూన్ల పిండి
రుచికి మిరియాల పొడి

తయారు చేసే పద్ధతి

వెన్న, ఛీజ్ మినహా మిగతా పదార్థాలన్నీ కలిపి పెద్ద పాత్రలో మధ్యస్థంగా వుండే సెగపై ఉడికించాలి. కూరగాయ ముక్కలన్నీ మెత్తబడే వరకు ఉంచాలి. వీటిని పక్కన ఉంచుకుని, నాన్-స్టిక్ పాన్‌లో నెయ్యి వేడిచేసి కాగాక, పిండివేసి కొద్ది నిమిషాలు వేయించాలి. నిరంతరం కలియబెడుతుండాలి.

దీనికి కూరగాయ ముక్కలతో సహా సూప్ కలపాలి. మధ్యస్థమైన సెగమీద ఐదు నిమిషాలు ఉడికించి, వడ్డించాలి.

క్యారెట్ సూప్

కావాల్సిన పదార్థాలు

వెన్న - ఒక టేబుల్ స్పూన్
క్యారెట్ ముక్కలు -ఒక కప్పు
ఉల్లిపాయలు - రెండు
చికెన్ స్టాక్ లేదా నీళ్లు - ఐదు కప్పులు
ఉప్పు, మిరియాల పొడి
అర కప్పు ఆరెంజ్ జ్యూస్

తయారు చేసే పద్ధతి

సాస్ పాన్‌లో వెన్న కరిగించి, క్యారెట్, ఉల్లిపాయ ముక్కలు వేసి మెత్తబడే దాకా ఉడికించాలి. స్టాక్ కలిపి ఉప్పు, మిరియాల పొడి వేసి పొంగురానిచ్చి, సెగ తగ్గించాలి. మూతపెట్టి సిమ్‌లో బాగా కాగనివ్వాలి. సూప్‌ను కొద్దిగా చల్లారనిచ్చి వడకట్టుకోవచ్చు. లేదా బ్లెండర్‌లో కాని ఫుడ్ ప్రాసెసర్‌లో కాని వేసి పూరీ తయారు చేయవచ్చు. అవసరమైతే సూప్‌ను తాలింపు పెట్టి కాచుకోవచ్చు.

మిక్స్‌డ్ వెజిటబుల్ సూప్

టొమేటో సూప్


క్యారెట్ సూప్

క్రీమీ పొటాటో సూప్

నిమ్మ, కొత్తిమీర సూప్

స్ఫూర్తి

'వార్ అండ్ పీస్' మానవ జీవితపు సంపూర్ణ చిత్రం. ఆనాటి రష్యా దేశపు కథ. 'చరిత్ర'లో ప్రజలు జరిపిన పోరాటాలు, ప్రజల సుఖదుఃఖాలకు, ఔన్నత్యానికి, అవమానాలకు సంపూర్ణ చిత్రం. ఒక యుద్ధానికి మరొక యుద్ధానికి మధ్య ఉండే విరామమే 'శాంతి'. యుద్ధం ఎప్పుడూ ఉంటుందని చెప్తుందీ నవల.

మనిషి లోపల జరిగే యుద్ధం, బయట జరిగే యుద్ధం... నిరంతరం సాగుతూనే ఉంటుంది. సూర్యుని చుట్టూ తిరిగే భూమిలా పోరాటాల వెంట ప్రజలుంటారని చెబుతుంది.

'శాంతి' అనేది ఒక స్వప్నం మాత్రమేనని టాల్‌స్టాయ్ చెబుతాడు. నవల చదువుతూ ఆ నవలలో జీవించడం అద్భుతమైన అజరామరమైన అనుభవం. ఇందులో 500 పాత్రలున్నాయి. ప్రతి పాత్రకొక విశిష్టమైన వ్యక్తిత్వం ఉంటుంది. యదార్థాన్ని జీవితంలోంచి స్వీకరించాడు టాల్‌స్టాయ్. అందుకే ఆ పుస్తకం అద్భుత విజయం సాధించింది. నేనెందుకు జీవిస్తున్నాను? నేనెలా జీవించాలి...! అన్న ప్రశ్నలకు ఆ నవల ఇచ్చిన సమాధానం నన్నెంతగానో ప్రభావితం చేసింది. చదవమని చాలా మందికి చెప్పాను. అలాగే 'పథేర్ పాంచాలి' నవల కూడా. కొన్ని రోజులు నన్ను వెంటాడింది. మధురమైన మన బాల్య స్మృతుల్లోకి తీసుకెళ్లింది. తనవితీరా ఆ... అమాయకపు రోజులను జ్ఞాపకం చేసింది. ఎంతో ఆనందాన్ని హృదయంలో నింపింది. ఆశావహ దృక్పథాన్ని అలవర్చుకోడానికి, దాన్ని అర్థం చేసుకోవడానికి దోహదపడింది. ఈ నవలను సత్యజిత్‌రే సినిమా కూడా తీశారు.

-భూపతి వెంకటేశ్వర్లు
సిపిఎం నల్గొండ జిల్లా
కార్యదర్శి వర్గ సభ్యులు.



హృదయాన్ని సానపట్టిన పుస్తకాలు

చిన్నప్పటి నుండి పుస్తకాలు చదివేవాణ్ణి. వీటికి తోడు సినిమాలు చూసేవాణ్ణి. పైగా ఆట, పాట, నాటికలంటే ఇష్టం. కాని.. భావాలను భాషలోకి మార్చే శక్తి నాలో లేదు. కొన్ని భావాలు, ఆలోచనలు అర్థంకాక, ఒక వేళ అర్థమైనా అవతల వ్యక్తి ఏమనుకుంటాడోనన్న భయం. నేను చదివిన సాహిత్యం ఈ శిక్షణను ఇవ్వలేదు.

ఇక పుస్తకాలు చదవడాన్ని గూర్చి రెండు మాటలు.... ఒకొకరు ఎన్నో పుస్తకాలు చదువుతారు. గొప్ప సాహిత్యాన్ని చదువుతారు. కాని వారి మాటల్లోగానీ, వారి సంస్కారంలోగానీ ఇసుమంత కూడా వాటి ప్రభావం కనిపించదు. పైగా అసహ్యంగా వున్నా ఆశ్చర్యంలేదు. అలాగే ఎప్పుడో ఒక మంచి పుస్తకం చదివిన కొందరు ఆ పుస్తకం నుంచి ఎంతో నేర్చుకొని ఎంతో సంస్కారాన్ని సంపాదించుకుంటారు. విద్యార్థి దశలో 100 నవలలు చదివినా ఏమీ నేర్చుకోలేకపోయా. అలా దొరికిన పుస్తకాన్నల్లా చదివినా సమయం వృధా అయిందేగానీ ఇదిగో ఇందుకు ఉపయోగపడ్డాయని చెప్పలేని స్థితి. నేను ఇన్ని పుస్తకాలు చదివానని చెప్పుకునేందుకు మాత్రమే ఉపయోగపడ్డాయి.



కాని నన్ను నేను ఒక పాత్రలో.. ఒక దృశ్యంలో.. ఒక మాటలో... చూసుకున్న పుస్తకమే గొప్ప పుస్తకం. ఈ దృష్టితో చూసినపుడు నేను చదివిన నవలల్లో 'వార్ అండ్ పీస్', 'పథేర్ పాంచాలి'... లాంటివి నా.. హృదయాన్ని సాన బట్టాయి. సంస్కారాన్ని నేర్పాయి. నిజంగా ఆ నవలలు చదవడం గొప్ప అదృష్టమంటాను.

ప్రపంచ నవలా సాహిత్యంలో అగ్ర భాగాన నిలిచే నవలను ఒకదాన్ని చెప్పమంటే.. వెంటనే గుర్తొచ్చే నవల 'వార్ అండ్ పీస్' (యుద్ధము–శాంతి). ఈ నవలను సృష్టించిన రచయిత టాల్‌స్టాయ్. ఈయన మేటి రచయితల్లో ఒకరని నిస్సందేహంగా చెప్పవచ్చు.

'వార్ అండ్ పీస్' మానవ జీవితపు సంపూర్ణ చిత్రం. ఆనాటి రష్యా దేశపు కథ. 'చరిత్ర'లో ప్రజలు జరిపిన పోరాటాలు, ప్రజల సుఖదుఃఖాలకు, ఔన్నత్యానికి, అవమానాలకు సంపూర్ణ చిత్రం. ఒక యుద్ధానికి మరొక యుద్ధానికి మధ్య ఉండే విరామమే 'శాంతి'. యుద్ధం ఎప్పుడూ ఉంటుందని చెప్తుందీ నవల.

మనిషి లోపల జరిగే యుద్ధం, బయట జరిగే యుద్ధం... నిరంతరం సాగుతూనే ఉంటుంది. సూర్యుని చుట్టూ తిరిగే భూమిలా పోరాటాల వెంట ప్రజలుంటారని చెబుతుంది.

'శాంతి' అనేది ఒక స్వప్నం మాత్రమేనని టాల్‌స్టాయ్ చెబుతాడు. నవల చదువుతూ ఆ నవలలో జీవించడం అద్భుతమైన అజరామరమైన అనుభవం. ఇందులో 500 పాత్రలున్నాయి. ప్రతి పాత్రకొక విశిష్టమైన వ్యక్తిత్వం ఉంటుంది. యదార్థాన్ని జీవితంలోంచి స్వీకరించాడు టాల్‌స్టాయ్. అందుకే ఆ పుస్తకం అద్భుత విజయం సాధించింది. నేనెందుకు జీవిస్తున్నాను? నేనెలా జీవించాలి...! అన్న ప్రశ్నలకు ఆ నవల ఇచ్చిన సమాధానం నన్నెంతగానో ప్రభావితం చేసింది. చదవమని చాలా మందికి చెప్పాను. అలాగే

'పథేర్ పాంచాలి' నవల కూడా. కొన్ని రోజులు నన్ను వెంటాడింది. మధురమైన మన బాల్య స్మృతుల్లోకి తీసుకెళ్లింది. తనవితీరా ఆ... అమాయకపు రోజులను జ్ఞాపకం చేసింది. ఎంతో ఆనందాన్ని హృదయంలో నింపింది. ఆశావహ దృక్పథాన్ని అలవర్చుకోడానికి, దాన్ని అర్థం చేసుకోవడానికి దోహదపడింది. ఈ నవలను సత్యజిత్‌రే సినిమా కూడా తీశారు.

ఓసారి గురజాడ 'కన్యాశుల్కం' వరంగల్‌లో చూశాను. నేటికీ కొన్ని పాత్రలు, సంభాషణలు సజీవంగా కళ్ల ముందు నిలుస్తాయి. హృదయాన్ని కదిలిస్తుంది. ఇలా కవిత్వంతోనూ, సాహిత్యంతోనూ, నాటకాలతోనూ, పుస్తకాలతోనూ చివరికి మార్క్సిజంతో నా బంధం పెనవేసుకుపోయింది.

◆◆◆

మాది మధ్య తరగతి 'గీతకార్మిక' కుటుంబం. వరంగల్ జిల్లా కొడకండ్ల మండలం వడ్డెకొత్తపల్లి నా సొంత ఊరు. పచ్చి పల్లెటూరు. మా నాన్న .. పదహారణాల రైతు బిడ్డ. ప్రతి పైసా లెక్క కట్టే పొదుపరి. దొరలకు అవిభక్తుడు. యతి రాజారావు, విమలాదేవి విసునూరు దేశ్‌ముఖ్‌ల వారసులు. ఊళ్లో వుంది ఒకే పార్టీ, ఒకే మాట. అదే దొర మాట, దొర పార్టీ. మానాన్న, చిన్నాయన పేరిట ఉన్న 20 ఎకరాల భూమి దొరగారి రైసుమిల్లుకు తాకట్టుపెట్టారు. ఆ మిల్లు అప్పుల నోటీసులు మా ఇంటికే వచ్చాయి. ఆ నోటీసులు చదివి అర్థం చేసుకొనే తెలివితేటలు నాకు లేవు. ఎంఎల్‌ఎ ఎలక్షన్లు వచ్చాయంటే చెన్నూరు నియోజకవర్గానికి ప్రధాన పోటీ మా దొరే. నేను పాట పాడని మీటింగ్, నేను రాయని గోడ రాతల్లేవు. ఇలా దొరగారి సేవలో సాంస్కృతిక కార్యక్రమాలు, నినాదాలు, ఊరేగింపులు ఇలా రెచ్చిపోతూ కనిపించేవాణ్ణి. దీంతో పదో తరగతిలో అత్తెసరు మార్కులకు అంత పెద్ద తొర్రూర్ కాలేజీలో సీటు దొరకడమంటే గొప్ప. నేను దొరగారికి చేసిన పుణ్యం ఉరికే పోతుందా.. కృతజ్ఞతగా సాయం చేశారు. కాలేజీలో ప్రగతిశీల విద్యార్థి సంఘంలో ముఖ్య నాయకుడిగా, కాలేజీ వార్షికోత్సవ సభకు, కాళోజీ నారాయణరావు గారిని ఆహ్వానించాం. మా ఎమ్మెల్యే దొరగారు కూడా సభలో ఉన్నారు. సినారె గీతం "కదిలింది... అరుణ సైన్యం..." నాతో పాడించారు. చచ్చింది గొర్రె. తెల్లారె "గడి" ముందుకు మా నాయనను పిలిపించి హెచ్చరించి వెళ్లగొట్టారు. మా నాయనకు ఎదిరించే చైతన్యం లేక మాకున్న భూమి, ఇల్లు అమ్ముకొని నల్గొండ జిల్లా తిరుమలగిరి మండలం తాటిపాముల గ్రామానికి వచ్చి భూమి కొనుక్కున్నాం. అక్కడా "దొరలున్నారు". కాని దొరతనం లేదు. "గడి" ఉంది. కాని పడావుబడ్డ గుడి. మేమే కొన్నాం. అప్పటికే ఆ గ్రామంలో సిపిఎం ఉంది. భువనగిరి డిగ్రీ కాలేజీలో బికామ్‌లో చేరాను. మా గ్రామ సిపిఎం నాయకుడు కారుపోతుల అంజన్న ఎస్ఎఫ్ఐలో సభ్యత్వం ఇప్పించారు. సంగు రవీందర్, సోమన్న, పామిన్‌పాషా నాయకులతో నాకు పరిచయమైంది. ఎస్ఎఫ్ఐ పాటలు పాడుతూ సభ్యత్వ క్యాంపెయిన్‌లో పాల్గొనేవాడిని. ఆరోజుల్లో మార్క్సిస్టు మూల సూత్రాలు చదివాను. నా అవగాహన సమూలంగా మారిపోయింది. వర్గాలు, వర్గపోరాటాలు, దోపిడీ పీడన వంటి మాటలకు అర్థం తెలిసింది. కాలేజీలో ఎస్ఎఫ్ఐ ప్యానల్ నుండి కల్చరల్ సెక్రటరీగా పోటీ చేసి గెలిచాను. మా గ్రామంలో రెడ్‌స్టార్ కల్చరల్ సంస్థను ఏర్పర్చి నాటక బృందాన్ని తయారు చేశాను. జాతీయ స్థాయిలో బహుమతులందుకున్నాను. ఢిల్లీ, మద్రాసు, కలకత్తా లాంటి నగరాల్లో నాటికలు వేశాము. ప్రజానాట్య మండలి శాంతారావు పరిచయమై పిఎస్ఎం నెల్లూరు రాజకీయ తరగతులకు హాజరయ్యాను. మానవుని పుట్టుక, పరిణామ క్రమం, పార్టీ కార్యక్రమం, నిర్మాణం లాంటి అంశాలు నాకెంతో ఉపయోగపడ్డాయి. ఉత్తేజం, విశ్వాసాన్నిచ్చాయి. మల్లు వెంకట నర్సింహారెడ్డి నన్ను భువనగిరి పిఎస్ఎం షాట్‌లో చూసి కల్లు గీత కార్మిక సంఘం జిల్లా కేంద్రం, పార్టీ పూర్తికాలం కార్యకర్తగా చేసి జిల్లా కేంద్రానికి (2001లో) తీసుకొచ్చారు. చేతివృత్తులపై అధ్యయనం, పోరాటాలు, నావృత్తి, ప్రవృత్తి. చివరిగా ఒక్క మాట...

నేను చదివిన పుస్తకాల్లో ...నిజ జీవితంలో అన్యాయం, అవినీతి, దౌర్జన్యం...అన్నీ చదివాను. చవిచూశాను. మనిషిని మనిషి పీక్కు తినే సమాజం కాక మనిషిని మనిషి గౌరవించుకునే సమాజం రావాలని కోరుకుంటున్నా. అందుకోసం పనిచేస్తుంటా. ★



పుస్తకాలు చదవడాన్ని గూర్చి రెండు మాటలు.... ఒకొకరు ఎన్నో పుస్తకాలు చదువుతారు. గొప్ప సాహిత్యాన్ని చదువుతారు. కాని వారి మాటల్లోగానీ, వారి సంస్కారంలోగానీ ఇసుమంత కూడా వాటి ప్రభావం కనిపించదు. పైగా అసహ్యంగా వున్నా ఆశ్చర్యంలేదు. అలాగే ఎప్పుడో ఒక మంచి పుస్తకం చదివిన కొందరు ఆ పుస్తకం నుంచి ఎంతో నేర్చుకొని ఎంతో సంస్కారాన్ని సంపాదించుకుంటారు. విద్యార్థి దశలో 100 నవలలు చదివినా ఏమీ నేర్చుకోలేకపోయా. అలా దొరికిన పుస్తకాన్నల్లా చదివినా సమయం వృధా అయిందేగానీ ఇదిగో ఇందుకు ఉపయోగపడ్డాయని చెప్పలేని స్థితి. నేను ఇన్ని పుస్తకాలు చదివానని చెప్పకునేందుకు మాత్రమే ఉపయోగపడ్డాయి.

కాని నన్ను నేను ఒక పాత్రలో.. ఒక దృశ్యంలో.. ఒక మాటలో... చూసుకున్న పుస్తకమే గొప్ప పుస్తకం. ఈ దృష్టితో చూసినప్పుడు నేను చదివిన నవలల్లో 'వార్ అండ్ పీస్', 'పథేర్ పాంచాలి'... లాంటివి నా.. హృదయాన్ని సాన బట్టాయి. సంస్కారాన్ని నేర్పాయి. నిజంగా ఆ నవలలు చదవడం గొప్ప అదృష్టమంటాను.

ప్రపంచ నవలా సాహిత్యంలో అగ్ర భాగాన నిలిచే నవలను ఒకదాన్ని చెప్పమంటే.. వెంటనే గుర్తొచ్చే నవల 'వార్ అండ్ పీస్' (యుద్ధము-శాంతి). ఈ నవలను సృష్టించిన రచయిత టాల్‌స్టాయ్. ఈయన మేటి రచయితల్లో ఒకరని నిస్సందేహంగా చెప్పవచ్చు.

వికాసం

రాఘవరావు భార్య పోయి ఏడాదైంది. దాంతో ఆయన మకాం పల్లెటూరి నుంచి పట్నంలో ఉద్యోగం చేసుకొనే కొడుకు ఇంటికి మారింది. అప్పటినుంచి ఆయన జీవితమే మారిపోయింది. ఈయనగారికి నిన్నటిదాకా అన్నీ భార్యే అమర్చిపెట్టేది. ఏ నిముషం ఏమవసరమో నోరు తెరిచి అడగకుండానే జరిగిపోయేది. ఇప్పుడలా కాదు. అన్నిటికీ ఎదురుచూపులే.



భారం కాకుండా...

ఇందిరా పార్క్...ఉదయం 6.30. నడక...పరుగు...యోగా...నవ్వుల థెరపీ...ఇలా ఎవరికి మంచిదనిపించిన పద్ధతుల్లో వారు వ్యాయామం చేస్తున్నారు. ఓ సిమెంట్ బెంచీ మీద ఎప్పటిలాగే ముగ్గురు మిత్రులు కనిపించారు. అంతా విశ్రాంత ఉద్యోగులే. అందరూ అక్కడకు వ్యాయామం కోసం వస్తుంటే వీరు మాత్రం మనసారా మాట్లాడుకోవడానికే వస్తారు. కొడుకులు, కోడళ్లు, మనవలు, మనవరాళ్ల సంగతులు, సమస్యలు...అన్నీ ఏరోజుకారోజు చెప్పుకొని మనసు తేలికపరచుకొంటారు. ఆరోజు ముగ్గురూ ఎవరికి వారు కూర్చుని వున్నారు. అందరి మొహాల్లోనూ ఏదో తెలీని బాధ, విచారం గోచరిస్తున్నాయి.

రాఘవరావు భార్య పోయి ఏడాదైంది. దాంతో ఆయన మకాం పల్లెటూరి నుంచి పట్నంలో ఉద్యోగం చేసుకొనే కొడుకు ఇంటికి మారింది. అప్పటినుంచి ఆయన జీవితమే మారిపోయింది. ఈయనగారికి నిన్నటిదాకా అన్నీ భార్యే అమర్చిపెట్టేది. ఏ నిముషం ఏమవసరమో నోరు తెరిచి అడగకుండానే జరిగిపోయేది. ఇప్పుడలా కాదు. అన్నిటికీ ఎదురుచూపులే. ఉదాహరణకు కప్పు కాఫీకి కూడా గంటల తరబడి ఎదురుచూడాలి. ఇది రాఘవరావుకు నచ్చదు. భార్యకుమల్లే అన్నీ అమర్చాలని కోరుకుంటారు. అటువైపు కోడలు పిల్ల సంగతి చూద్దాం. ఆమె కూడా ఉద్యోగం చేస్తుంది. దాంతో ఉదయాన్నే లేచింది మొదలు పిల్లలకు, భర్తకు, కొత్తగా కుటుంబ సభ్యులైన మామగారికి... అందరికి ఆమే చేయాలి. మామగారి గురించి ఆమె వైపు నుంచి కొన్ని ఫిర్యాదులున్నాయి.

"నేను కూడా నిముషం కాలు మడవకుండా పనిచేస్తున్నాకదా. ఆయనగారు ఖాళీగానే వుంటారు కాబట్టి ఏదైనా సాయం చేయొచ్చుగా" అంటుంది.

పిల్లలను స్కూలు దగ్గర దిగబెట్టడం, తీసుకురావడం, ట్యూషన్‌కు పంపించడం, కూరగాయలు, పాలు, చిన్న చిన్న సరకులు తెచ్చిపెట్టడం, నల్లాలో నీళ్లు వచ్చినప్పుడు పట్టివుంచడం వంటివి తెచ్చిపెట్టడం చేయొచ్చుగా అన్నది ఆమె వాదన.

కానీ పెద్దాయనకేమో పుట్టిన దగ్గర నుంచి ఇప్పటి వరకు చేయించుకోవడమే కానీ చేయడం రాదు. అలవాటు లేదు. ఇంతవరకు లేని అలవాటు ఒక్కసారిగా రావాలన్నా కష్టమేనేమో. అదే ఇప్పుడు ఆయనపాలిట శాపమైంది.

పైగా భార్య వున్నప్పుడు తెల్లటి పంచె, చొక్కా వేసుకొని దర్జాగా వాకిట్లో కుర్చీ వేసుకొని కూర్చునేవాడు. వచ్చే పోయే వారిని పలకరిస్తూ కాలం వెళ్లబుచ్చేవాడు. ఇప్పుడో! మాసిపోయిన పంచెచొక్కా వేసుకొని తన గదిలో వుండాల్సి వస్తోంది. తనను గుర్తించి గౌరవంగా పలకరించేవారు, ఆప్యాయంగా కబుర్లు చెప్పేవారు కరవయ్యారు.

అంత దర్జాగా బతికిన తను ఇప్పుడు పిల్లలకు, ఇంట్లో చిన్నాచితకా పనులు చేయాలన్న ఆలోచనే ఆయనకు కష్టంగా వుంటోంది. దాంతో ఇంట్లో ఇమడలేకపోతున్నాడు. అలాగని ఎక్కడికీ వెళ్లలేడు. కొడుకు తప్ప వేరే దిక్కులేదు. ఏం చేయాలనేది ప్రశ్న.

దాదాపుగా మిగతా ఇద్దరు మిత్రులదీ అదే పరిస్థితి. ఇంట్లో సరైన ఆదరణ లేదు.

భార్యలు వున్నన్నాళ్లూ...మహారాజుల్లా సాగింది. కనుసైగతోనే అంతా సాగింది. ఇప్పుడు పూర్తిగా భిన్నంగా వుంది పరిస్థితి. మరి కొత్త తరంతో భారం కాకుండా కలిసి జీవించడమెలా! అన్నదే ప్రశ్న?

మన భేషజాలు, పటాటోపాలు అన్నీ పక్కనబెడితే కొంతవరకు సమస్య పరిష్కారం కావచ్చు. భార్యాభర్తా ఉద్యోగాలు చేస్తేగానీ సంసారాలు నడవని రోజులు కావడంతో...అందుకు తగ్గట్టుగానే పెద్దలలోనూ మార్పు రావాలి. ఓపిక వున్నంత వరకు కొన్ని పనులు ఇతరుల మీద ఆధారపడకుండా చేసుకోవడం మంచిది. స్నానానికి నీళ్లు తోడుకోవడం, కాచుకోవడం వంటివి. వీలైతే పిల్లల విషయంలో కోడలు ఆశిస్తున్న సాయం అందించడం... కూరలు గట్రా తెచ్చిపెట్టడం వంటివి చేయొచ్చు. మన వల్ల వారు భారం ఫీలవకుండా ... చేతనైన సాయం చేస్తే వారూ సంతోషిస్తారు. అలా కాకుండా అన్ని సేవలు జరిగిపోవాలి, ఎప్పటిలాగే సాగిపోవాలంటే ప్రస్తుత పరిస్థితుల్లో కూసింత కష్టమే. ఇలా చేసినా అవతలివైపు నుంచి నిర్లక్ష్యం, నిరాదరణ ఎదురైందీ అంటే...అటు వైపున కూడా మార్పులు చేసుకోవాల్సి వుందీ అనే అర్థం. చిన్నతనం నుంచి పెంచి పెద్దచేసిన, మంచిచెడ్డలు చూచిన, ఇంతవాళ్లవడానికి కారకులైన పెద్దల పట్ల గౌరవభావం వుండాలి. వీలైనంతలో, చేతనైనంతలో వారికి లోటు లేకుండా చూసుకోవాల్సిన బాధ్యత మనదే.

రెండు వైపులా ఇలాంటి ఆలోచన, సర్దుకుపోయే మనస్తత్వం వుంటేనే ఎవరూ ఎవరికీ భారం కారు. బాంధవ్యం సజీవంగా వుంటుంది.

- కె. చరిత

కుటుంబమంతా ఆర్చరీకే అంకితం...

సిహెచ్. లెనిన్ ...

ఈపేరు వినే ఉంటారు. ప్రపంచ ప్రఖ్యాత విలువిద్య క్రీడాకారుడు. ప్రస్తుతం అతను మన మధ్య లేకపోయినా.... ఆర్చరీలో విజయవాడ ఖ్యాతిని అంతర్జాతీయ స్థాయికి తీసుకువెళ్లిన గొప్ప వ్యక్తి చెరుకూరి లెనిన్. కాంపౌండ్ విభాగంలో దేశంలోవున్న అతి కొద్ది మంది క్రీడాకారుల్లో అగ్రగణ్యుడు. క్రీడాకారుడు మాత్రమే కాదు. కోచ్‌గా కూడా ఎంతో మంది యువ క్రీడాకారులను తీర్చిదిద్దిన ఘనత అతని సొంతం. అతను శిక్షణనిచ్చిన రితుల్ చటర్జీ, జిజ్ఞాస్ కామన్‌వెల్త్ పోటీలలో బంగారు పతకాలు సాధించి తెలుగుప్రజల సత్తాను ప్రపంచవేదిక మీద చాటారు.

లెనిన్ ప్రొఫైల్ ...

- 2004 నుండి 2010 వరకు ఆర్చరీ కాంపౌండ్ విభాగంలో జాతీయ ఛాంపియన్.
- 2006 న్యూఢిల్లీలో జరిగిన ఆర్చరీ ఛాంపియన్‌షిప్‌లో కాంపౌండ్‌లో టీమ్ విభాగంలో స్వర్ణ పతకం.
- 2010లో జరిగిన ఆసియా గ్రాండ్‌ప్రి టీమ్ విభాగంలో కాంస్య పతకం.
- 2007 కొరియాలో జరిగిన ప్రపంచ ఆర్చరీ టోర్నీ, జర్మనీలో జరిగిన ప్రపంచ ఛాంపియన్‌షిప్ టోర్నమెంట్‌లో భారత జట్టుకు ప్రాతినిధ్యం

కామన్‌వెల్త్‌లో పతకాలు సాధించినందుకు గాను లెనిన్‌ను, అతని శిష్యులను రాష్ట్ర ప్రభుత్వం గతనెల 23వ తేదీన హైదరాబాద్‌లో ఘనంగా సత్కరించింది. అన్నీ సజావుగా జరిగితే... ఆ ముగ్గురూ మరుసటి రోజున సొంత ఊరు విజయవాడలో ఆర్చరీ అసోషియేషన్‌వారి అభినందనలను అందుకొనేవారే. ఈ కార్యక్రమానికి హాజరవడానికిగాను 23వ తేదీ రాత్రి హైదరాబాద్ నుండి విజయవాడ బయలుదేరి వస్తుండగా జూపూడి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదం లెనిన్‌ను బలితీసుకొంది.... అంతే ఎంతోమంది క్రీడాకారుల ఆశలు ఆవిరయ్యాయి.

విలువిద్యకే...

లెనిన్ కుటుంబం అంతా ఆర్చరీ (విలువిద్య)కే పూర్తిగా అంకితమైంది. లెనిన్ చెల్లెలు చెరుకూరి ఓల్గా కూడా ఆర్చరీ క్రీడాకారిణి. అయితే ఆటలో మంచి నైపుణ్యం ప్రదర్శిస్తున్న సమయంలోనే 2004లో ఆమె ఆత్మహత్య చేసుకుంది. ఇక లెనిన్ తండ్రి కృష్ణా జిల్లా ఆర్చరీ అసోసియేషన్‌ను ప్రారంభించి విలువిద్యలో ఎంతో మంది యువ క్రీడాకారులను తయారుచేసి నగరానికి విలువిద్యలో మంచి పేరును తీసుకువచ్చారు. ఎంతో మంది యువ విలువిద్యా క్రీడాకారులను తీర్చిదిద్దాలనే ఉద్దేశంతో రెండు సంవత్సరాల క్రితం ఓల్గా ఆర్చరీ అకాడమీని ప్రారంభించారు. అకాడమీ ద్వారా ఎంతో మంది జాతీయ, అంతర్జాతీయ క్రీడాకారులను తయారుచేసి నగర ఖ్యాతిని అంతర్జాతీయ స్థాయికి తీసుకువెళ్లడంలో విశేష కృషి చేశారు. అకాడమీకి అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తీసుకురావాలనే ఉద్దేశంతో ప్రత్యేకంగా వెబ్‌సైట్‌ను రూపొందించి, అకాడమి అభివృద్ధికి లెనిన్ అహర్నిశలు కృషి చేశారు. ఇదేకాక తనూ పోటీల్లో పాల్గొన్నారు.

ఏకలవ్య సాధన...

లెనిన్ అంతర్జాతీయ స్థాయి క్రీడాకారుడిగా రాణించడానికి ప్రత్యేకంగా కోచ్‌లు ఎవ్వరూ లేరు. ఒకరకంగా అతనిది ఏకలవ్య సాధన. పది సంవత్సరాల క్రితం విజయవాడ నగరంలో జాతీయస్థాయి ఆర్చరీ టోర్నమెంట్ నిర్వహించినపుడు అప్పటి అంతర్జాతీయ విలువిద్యా క్రీడాకారుడు లింబారామ్ నగరానికి విచ్చేశారు. ఆయనను చూశాక లెనిన్‌కు కూడా ఆర్చరీ నేర్చుకోవాలనే కోరిక, పట్టుదల కలిగింది. అంతే తన తండ్రి సత్యనారాయణ వద్దకు వెళ్లి తాను ఆర్చరీ నేర్చుకుంటానని చెప్పడంతో ఆయన భుజం తట్టి ప్రోత్సహించారు. అప్పటి నుండి తనకు తానే బాణాలను వేస్తూ, సీనియర్ క్రీడాకారుల సలహాలు తీసుకుంటూ సాధన చేస్తూ అంతర్జాతీయ స్థాయిలో రాణించాడు. తాను క్రీడాకారుడిగా రాణించడమే కాక యువ ఆర్చర్లను తీర్చిదిద్దే స్థాయికి చేరుకున్నాడు. అంటే ఏకలవ్య సాధన ద్వారానే ద్రోణాచార్యుడిగా మారాడని చెప్పవచ్చు. అయితే లెనిన్‌కు ఒలింపిక్స్‌లో పతకం సాధించాలనే కోరిక ఉంది. దానిని 2012లో జరిగే పోటీలలో సాకారం చేసుకునేందుకు తీవ్ర కృషి చేస్తున్నాడు. ఈదశలో అతనిని మృత్యువు కబళించింది.

లెనిన్ ఆశయాలను సాధిస్తాం...

ఇద్దరు బిడ్డలను పోగొట్టుకుని దుఃఖసాగరంలో వున్నప్పటికీ తన కుమారుడి ఆశయం నెరవేర్చాలన్నదే ఆ తండ్రి ఆశయం. కృష్ణాజిల్లా విలువిద్యా సంఘం అధ్యక్షులు కూడా అయిన చెరుకూరి సత్యనారాయణ మాట్లాడుతూ ఎట్టి పరిస్థితుల్లోనూ లెనిన్ శిష్యులు ఒలింపిక్స్‌లో పతకం సాధించి లెనిన్ కలను సాకారం చేస్తారని తెలిపారు.

- పి.వెంకటేశ్వరరావు,

విజయవాడ.

కవిత్వమ్

మైక్రో ఫైనాన్స్ మోసం



పల్లవి -:
మైక్రోఫైనాన్స్ కాదు మయాదారి అప్పు అది
తక్కువ వడ్డీ అని చెప్పి అసలు కంటె ఎక్కువనే
వడ్డీ భారం మోయలేక నడ్డీ విరిగి పోబట్టె
వామ్మో వాక్కో మన మేడాకడతాం
ఈ మాయదారి ఫైనాన్స్ ॥మైక్రో॥
చ-1
ఆంధ్రప్రదేశ్‌లో గల్లీలల్లో వీధులల్లో
మైక్రోలు పాగ వేసి - మన రక్తం గుంజబట్టె
పావల వడ్డీ ఇస్తామని- ప్రభుత్వం మోసం జేసె
అధిక వడ్డీలతోటి- మైక్రో వేధింపులాయె ॥మైక్రో॥
చ-2
నలుగురు గ్రూపుగా ఉంటే అప్పులిస్తామనిరి
అప్పు తెచ్చుకొని మనము అభివృద్ధి అవుతామంటే
అధిక వడ్డీ భారంతో - అప్పుల ఊబిలో పడితిమి
అభివృద్ధి ఏమోగాని కుటుంబాలే కూలబట్టె ॥మైక్రో॥
చ-3
ఒకటి కాదు రెండు కాదు డెబ్బది మంది చచ్చిరి
అప్పులు చెల్లించలేక ఆత్మహత్య చేసుకొనిరి
ప్రాణాలు పోతున్న ప్రభుత్వానికి పట్టలేదు
ఈ కాంగ్రెసు పాలనలో వామ్మో వాక్కో
ఆదుకునే నాథుడేడి - వామ్మో వాక్కో ॥మైక్రో॥
చ-4
మైక్రో సంస్థలన్ని సూక్ష్మ క్రిముల్లగా
వడ్డీల ముసుగులోనా మన ప్రాణాలు తీయబట్టె
ప్రభుత్వం మెడలు వంచి - మైక్రోలకు కల్లెమెయ్య
అందరం ఐక్యంగా ముందుకు కదులుదాం
కదలండి అక్కలారా కదలండి అమ్మలారా ॥మైక్రో॥

- జి. నరేష్

ర(రు)ణం

నాడు పప్పు కూటికై ఒప్పిన
అప్పు తెచ్చెను ముప్పు
నేడు పావలా వడ్డీకై..
అప్పుకు అట్టడుగు వర్ణాలకి "వల"
మైక్రో మర్మం తెలియని తరుణి
రుణం "స్పందన" చూచె!
బహు"మతుల" మతలబుల
సూక్ష్మం! తెలియని శ్రామిక జనం
"పుట్టి" ముంచిన మైక్రో రుణాల వ్రణాలు-
అన్నపూర్ణల యింట ఆత్మహత్యల హేల
రాహుల్ హస్త వాసిలో ఎదిగిన
సూక్ష్మీకరణ మాయలో మగువ
రుణాల, వడ్డీల ఊబిలో జారె!
ఢిల్లీ నుండి గల్లి దాకా
"ఫైనాన్సర్స్" గుండాలు-బడా బాబులు
నిత్య వేధింపులు-
కేంద్ర, రాష్ట్రాల గాంధారి "తత్వాలు"
పల్లె జాబిల్లిని మింగే రాహుకేతులు!
నాడు నరకాశురుడొక్కడే!
నేడు కీచకులు, నరకాశురులు వేలలో...
గుక్కెడు నీటి కోసం!
బుక్కెడు బువ్వ కోసం!
స్త్రీ మూర్తులంతా సత్యభామలై!
కాళిమాతలై.. కనకదుర్గలై!
మైక్రో ఋణవ్యవస్థకు "మంట"బెట్టాలి.!
అప్పుడే ఆనంద దీపావళి 'జ్యోతులింటింటా!
(మైక్రో ఫైనాన్స్ బాధితులకు సంఘీభావంగా...)

- తంగిరాల చక్రవర్తి

మీడియా! మీడియా!!

సూర్యకిరణాల కన్నా వేగం
డేగ కన్నుల కన్నా నిశితం
అద్దమా! అబద్ధమా!
అంతరంగమా! అహంకారమా!
మహానేత్రమెనుక దగా సూత్రమేదో దాగున్నది
మెగా మంత్రమేదో పొంచివున్నది
స్వర్గధామ మంటున్నది అంపశయ్యలాగున్నది
విప్లవించిన మూడోకన్ను సునామీలను రచిస్తున్నది
చరిత్ర సృష్టిస్తున్నది
ప్రపంచం మన పాదాల చెంతో..
ప్రపంచం పాదాల కింద మనమో...
అంత తేలిగ్గా అర్థమయ్యి చావదు
భస్మ నేత్ర మందామా? విజ్ఞాన దృష్టి అందామా!?
నూత్న సృష్టికి ప్రసవద్వార మందామా?!
మీడియా! మీడియా!
టుడే ఇండియా సరికొత్త మాఫియా! మహా ఫోబియా!
మన చేతిలో లేదయ! అంత ఏలిన వారి దయ!
ఏ దయా నిర్మల హృదయ?
వ్యాపార సంస్కృతికి వారసురాలివా?
పెట్టుబడిదారుల పెత్తందారీతనానివా?

ప్రజా సాంస్కృతుల ప్రాణాధారివా?
ఎవరు నీవు? ఏ వైపు నీ చావు? ఏదసలు నీ రూపు?
ఎవరి వెంట నీ నడక?
బికినీల్లోంచీ నీవే! చీర సరిగంచుల్లోనూ నీవే!
నిన్నెట్టా అర్థం చేసుకోవాలి.
రూపాయి కోరల కన్నుల్లో నీవే
కళా కాంతుల వెన్నెల్లో నీవే
నిన్నెట్టా ప్రేమించాలి నిన్నెట్టా ఆహ్వానించాలి
విశ్వమంతా నీవే.. నిన్నెట్టా విశ్వసించాలి!
సామ్రాజ్యవాద స్వరూపానివా!
సంక్షేమ క్షేత్ర బీజానివా?
స్వాహాతంత్రుల మనో సూత్రమా?
వెనుక ఆలోచనల ముందడుగువా?
ముందుతరం మహా నాయకుడివా?
ఎవరిపై నీ స్వారీ? ఎటువైపు నీదారి?

-శిఖా ఆకాష్



శ్రీ కొమర్రాజు వేంకట లక్ష్మణరావు
జీవిత చరిత్ర
వెల : 50-/,
పేజీలు :96
ప్రతులకు :
అజ్మీరు వీరభద్రయ్య
విశ్రాంత ఉపాధ్యాయులు
మక్కపేట,
వత్సవాయి మండలం,
కృష్ణాజిల్లా

మరో మార్క్స్ పుట్టాలె!
కథలు
ముదిగంటి సుజాతారెడ్డి
వెల : 50-/,
పేజీలు :104
ప్రతులకు :
విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్
4-1-435, విజ్ఞాన్ భవన్, అబిడ్స్,
హైదరాబాద్-001
మరియు
విశాలాంధ్ర అన్ని పుస్తక షాపులు



కొత్త పుస్తకాలు

కాలక్షేప కావ్యం

కథల్లాంటి కామెడీ సంఘటనలూ, కామెడీ ఫీచర్స్ – వ్యంగ్యంతో కూడిన హాస్యంతో భళ్ళున నవ్వించే చక్కిలిగిలి రచనలూ అంటూ ప్రముఖ రచయిత యర్రంశెట్టి శాయి – "నవ్వుల గని ఈ తాడూ బొంగరం" అని చిత్రకారులు బాలి– ముందుమాటల్లో పేర్కొన్నారు. దాదాపు 30 శీర్షికల్ని ఈ పుస్తకంలో పొందుపర్చి పాఠకుల్ని చక్కగా హాయిగా నవ్వించే ప్రయత్నం పులిగడ్డ వారు చేశారు. చాలా వ్యాసాల కింద జోక్స్ బాక్స్ కట్స్‌లో ఇవ్వడం చాలా బాగుంది. ఆంధ్రజ్యోతి పత్రికలో "తాడూ – బొంగరం" శీర్షిక (1984 –88)లో తాను రాసిన కొన్ని రచనలను ఈనాటి పాఠకులకు పుస్తకంగా అందించారు.

ఎ) "ఎదుటి వాడి మొహంలో మనం ఓ చిరునవ్వు తళుక్కు మనిపించినా అది గోదానంతో సమానం"

బి) ప్రేమే దైవం అంటారు– హాస్యమే ప్రేమ అని నేనంటాను లాంటి స్థిరమైన అభిప్రాయాలతో రచయిత ఈ హాస్య వ్యాస రచనలు చేశారు. నవరసాలలో హాస్యానికి ప్రత్యేక స్థానం వుంది. దెయ్యాలు, జోస్యాలు, పరాచికాలు, కోతలు, తారుమార్లు, భాషా అజ్ఞానం, అనేక అంశాలతో చక్కటి సునిశితమైన హాస్యంతో ప్రతి వ్యాసం నవ్విస్తుంది. హాస్యాన్ని పండించడంలో

తాడూ-బొంగరం
రచయిత : పులిగడ్డ విశ్వనాథరావు,
పేజీలు: 101 , -వెల 30/ రూ.
ప్రతులకు : రచయిత పేరుతో
404 - ఆక్రోపాలిస్ అకంథస్, రుక్మిణిపురి.
డా॥ ఎ.ఎస్.రావు నగర్,
సికింద్రాబాద్ -500062.

మునిమాణిక్యం, భమిడిపాటి వారు, ముళ్ళపూడి వారు, ఇటీవల కాలంలో జంధ్యాల, తెలుగు సాహిత్యంలో విస్మరణకు తావులేని వారు. ముప్పయి వ్యాసాలున్న ఈ పుస్తకం వైవిధ్య భరితమైన 'సామెతల్ని' అనుభవసారాన్ని – చక్కటి సెటైర్లతో రచయిత పాఠకుల్ని ఆహ్లాదపరిచారు. స్వాములు, సన్యాసులు, పరాచికాలు, జోస్యాలు, సైనుబోర్డులు, మతి మరుపు, దెయ్యాలు, తారుమార్లు, వక్ర రిపోర్టింగ్, డ్రూ ప్రాపర్ ఛానల్, తెలుగు పంచామృతాలు చాలా బాగున్నాయి.

- తంగిరాల చక్రవర్తి

తలారి తీర్పు
నాటికల సంపుటి
విడదల సాంబశివరావు
వెల : 60-/,
పేజీలు :79
ప్రతులకు :
విడదల సాంబశివరావు
3-173/1
పండరీపురం, 7వ లైను
చిలకలూరిపేట
గుంటూరుజిల్లా

ప్రకృతి విజ్ఞానం
డా॥ రాజూరు రామకృష్ణారెడ్డి
వెల : 60-/,
పేజీలు :112
ప్రతులకు :
విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్
4-1-435, విజ్ఞాన్ భవన్, అబిడ్స్,
హైదరాబాద్-001
మరియు
విశాలాంధ్ర అన్ని పుస్తక షాపులు



సీరియల్

జరిగిన కథ

ట్రాయ్‌ని చూడ్డానికి అనుమతి రావడంతో అంతా సంతోషిస్తారు. ఒకరు అతనితో మాట్లాడ్డానికి ప్రయత్నించినా...కుదరదు. అతను స్పృహ తప్పి వుంటాడు. తర్వాత ట్రాయ్‌ను మరో చోటికి మారుస్తారు. అప్పటికే అతని కాలు విరిగిపోయింది. ఇనుప సంకెళ్లతో బంధించి వున్నాడు. పోలీసుల దెబ్బలతో శరీరం హూనమైపోయింది. అయినా అతని దృఢ దీక్ష దెబ్బతినలేదు. యాంకీల దుశ్చర్యలను ధైర్యంగా ఖండిస్తాడు. అక్కడి నుంచి వచ్చేశాక...ట్రాయ్‌తో తన జ్ఞాపకాలను కుయేన్ చెప్తుంటుంది. మే 9న ట్రాయ్ అరెస్టయిన రోజు జరిగిన సంఘటన వివరిస్తుంటుంది. ఆ తర్వాత....

వియత్నాం వీరుడు ఎన్‌గుయెన్ వాన్‌ట్రాయ్

కథనం: ఫాన్-థి-కుయేన్

అనువాదం: పాటూరి రామయ్య

(ఆరవ భాగం)

'ప్రియమైన కుయేన్! నీవు నిజంగా ట్రాయ్‌కి తగినదానవు. అతడు నీయందు విశ్వాసంతో వున్నాడని, విప్లవాత్మక కార్యకలాపాల్లో ఎలా మెలగాలో నీకు నేర్పుతున్నాడని నువ్వు తెలుసుకోలేకపోయావు.

"నిన్ను చైతన్యవంతం చేసి ఒక పోరాట వీరవనితగా నిలపాలన్న దృష్టితోనే ట్రాయ్ అన్ని విమర్శలూ చేశాడు. మంచీ-చెడులను స్థూలంగా వివరించాడు.

"దక్షిణ వియత్నాం ప్రజల నికృష్ట జీవితాలకు హింసాకాండకు కారకులెవరో నువ్వు తెలుసుకునేందుకు, ఆ దుర్మార్గుల పైన నీద్వేషాన్ని పెంచేందుకు తగిన స్థాయి, చైతన్యం అభివృద్ధి పరచేందుకు కృషి చేశాడు ట్రాయ్. నీ భర్తను నేనెంతో గౌరవిస్తాను. ఇరవై ఏళ్ళ యువకుడు, అన్ని దుష్కృత్యాలకు, దురభ్యాసాలకు నిలయమైన సైగాన్ పట్టణంలో వుంటూ రెండు సంవత్సరాలకు ఒక్కసారి మాత్రమే సినిమా చూశారు అంటే అదే మానసికోల్లాసం కోసం ఎంత గొప్పవాడవంటావు!"

ఆమె వేలితో నన్ను అలా తాకింది. తత్తరపడి ఇలా అన్నాను.

"మేము చూసిన సినిమా బుద్ధుని జీవితానికి సంబంధించినది. అది ఏ కొంచెం కూడా నాకు అర్థం కాలేదు. ఇంటికి వచ్చిన తర్వాత ఆ సినిమాను గురించి చెప్పమని అడిగాను"

"నేను అంతా మర్చిపోయాను" అన్నాడు.

నాతోడి ఖైదీలందరూ గొల్లున నవ్వారు. కొంతమంది నవ్వును ఆపుకోలేక నోళ్ళకు చేతులు అడ్డం పెట్టుకున్నారు.

"ఎక్స్" సోదరి నన్నిలా అడిగింది.

"అతని జీవితానికి చెందిన సంగతులు నీకెప్పుడైనా చెప్పాడా?"

కొంచెం దూరంగా ఎండకాస్తున్న చోటకు వెళ్ళాం. శ్రద్ధగా వినవలసిందని నాతోటి వాళ్లందరికీ తెలియజేయబడింది.

నేను కథ ఇలా ప్రారంభించాను.

"ఆయన స్వగ్రామం, దాని పరిసరాలు నేను చూడలేదు. నన్ను తీసుకెళ్ళి చూపిస్తానని వాగ్దానం చేశాడు. మా పెళ్ళి అయిన తర్వాత నాలుగు రోజులు సెలవు తీసుకొని తన స్వగ్రామం "థ్వాన్‌క్విట్" తీసుకెళ్తానన్నాడు. ఆ గ్రామం క్వాంగ్‌నామ్ రాష్ట్రానికి చెందిన దియన్‌బాన్ జిల్లాలో ఉన్నది.

అది చాలా వెనకబడ్డ ప్రాంతం. వరిపొలాలు చాలా అరుదు. ప్రజలు పనుల కోసం దేశం వెంటబడిపోతుంటారు. సగాన్‌వలె కాదు. అక్కడ ఒక డబ్బా నీరు తెచ్చుకోవాలంటే సిగపట్టుపట్టి జగడమాడితేనే గాని రావు.

థూబాన్ నది అందం చెప్పవలవికాదని నాతో చెప్పాడు. ఆ నది తన ఇంటికి ఒక వందమీటర్లలో వుంది. ఆ నది నీళ్ళు చాలా నిర్మలమైనవి. దానికిరువైపులా ఇసుక తిన్నెలు వెదురుబొంగు చాళ్ళలో నీడలు తేలుతుంటాయి.

బాంగ్‌టూ వద్ద గల సముద్రతీరానికి సెలవు రోజుల్లో గుంపులు గుంపులుగా వచ్చే సైగాన్ ప్రజలను చూచినప్పుడు ట్రాయ్ ఇలా అనేవాడు.

'మా ప్రాంతం వెళ్ళినప్పుడు నది పొడవునా వున్న ఇసుక తిన్నెలు నీవు చూడగలవు. ఈ సముద్రతీరం కంటే అక్కడ మరీ ఆహ్లాదకరంగా ఉంటుంది. అక్కడ మన ఇష్టం ఉన్నంతసేపు ఎండలో చలిగాచుకోవచ్చు. ఎంత హాయిగా వుంటుందనీ!'

తన బాల్యం ఎంత హృదయ విదారకమైనదీ! చిన్నప్పుడే తల్లిపోయింది.

ఫ్రెంచి వలసాధిపతులు ఆప్రాంతంలోని విప్లవ వీరులపై దాడి సాగిస్తున్నప్పుడు ఆయనకు సరిగ్గా మూడేళ్ళ ప్రాయం. ఆ రోజుల్లో తన తల్లి పునరావాసం కోసం బిడ్డతో సహా అడవికి వెళ్ళింది. కొన్ని మాసాల తర్వాత ఆకలి మంటలకు గురై ఆమె మరణించింది. తండ్రి ఫ్రెంచి వాళ్ళ చేతుల్లో చిక్కాడు. జైలు నుంచి తప్పించుకొని చాలా దూరం వెళ్ళిపోయాడు. కొన్ని సంవత్సరాల

కొకసారి ఇంటికి వచ్చేవాడు.

తన మామ, పెద్ద అన్న, వదినగారు దగ్గరకు తీసి పెంచారు.

మా వివాహానికి ముందు ఒకసారి కాస్త పోట్లాడుకున్నాం. అలా పోట్లాడుకోవడం ఆయనకు చాలా బాధకలిగించింది. ఈ విధంగా అన్నాడు.

'చిన్నప్పుడే అమ్మపోయింది. కొన్ని సంవత్సరాల కొకసారి మాత్రమే తండ్రిని చూడగలుగుతున్నాను. తల్లిదండ్రుల ప్రేమాదరణలు నాకు లేకపోవడం వల్ల ఎండను భరించలేక దాహం గొన్న జీవంలా ఉంది నా మనసు.

"కానీ – ఇప్పుడు నాకొక ప్రియురాలుంది.

"నా మనసు కలత చెందుతోంది. మా కుటుంబం ఉత్తరాది నుంచి ఇక్కడకు వచ్చింది. నేను క్వాంగ్‌నాయ్ ప్రాంతం వదిలి జీవనోపాధి కోసం ఇక్కడికి వచ్చాను. ఈ రెండు పరిస్థితులూ మనల్ని ఒక చోటకు చేర్చాయి.

"మనం పరస్పరం గౌరవించుకుంటూ ప్రేమానురాగాలతో అన్యోన్యంగా ఉందాం."

పదిహేనవ ఏట పెద్దన్నగారితో దానాంగ్ వచ్చాడు. అన్నగారి సంసారం కడు పేదరికంతో సతమతమవుతోంది. ఇక వాళ్ళపై ఆధారపడి వుండటం భావ్యం కాదని తలచాడు. స్వయంగా బతికేందుకు ఏదైనా పని చూసుకోవాలనుకొన్నాడు. అందువల్ల సైగాన్ వచ్చేందుకు నిర్ణయించుకున్నాడు.

ఓడరేవు దగ్గర కెళ్ళాడు. ఓడలో సైగాన్ వెళ్ళేందుకు ప్లాటుఫారం మీదకు వెళ్ళడానికి సిద్ధమయ్యాడు. అన్నగారికి వీడ్కోలు ఉత్తరం ఒకటి రాసి ఒక స్నేహితుని చేతికిచ్చాడు. అమిత కుళ్ళు మోతువాడు ఆ స్నేహితుడు. ఓడ కదలిపోకముందే అన్నగారికి ఉత్తరం అందించాడు. ఓడ పైభాగాన నిల్చుని చూచాడు. ఆయన అన్నగారు చాలాదూరం నుంచి ఆవేదన, ఆతృతతో సైకిలు మీద పరుగెత్తి వస్తున్నాడు.

ట్రాయ్ ఓడపైనుంచి కిందికి పాకి కింది భాగాన కనబడకుండా దాక్కున్నాడు. అన్నగారు ప్లాట్‌ఫారం చుట్టూ తిరుగుతూ ఇలా పిలిచాడు.

'తమ్ముడూ, ట్రాయ్! ఇంటికిరా, మనం కలిసి మెలిసి వుందాం. నీ పెద్దన్న, అక్కయ్య వున్నారు నిన్ను పోషించడానికి. నువ్వు వెళ్ళిపోవద్దు తమ్ముడూ. వెళ్ళవద్దు, నువ్వు దూరంగా వెళ్ళితే అక్కడే చచ్చిపోతావు తమ్ముడూ!'

ట్రాయ్ దిగువున్న చోట నుంచి పెద్దగా ఏడ్చాడు. అన్నగారి మీదున్న గౌరవభావం ఆయన్ను వేధించింది. అయినా మళ్ళీ ఇంటికి వచ్చి అన్నకూ, ఆయన కుటుంబానికి భారం మోపదల్చుకోలేదు. ఇప్పటికే భార్య, పుట్టెడు పిల్లలతో ఇడుములు పడుతున్నాడు. ప్లాటుఫారం మీద నిల్చొని అన్న పిలుస్తూనే ఉన్నాడు.

"ట్రాయ్! నాతో ఇంటికి వచ్చేయ్! కలో, గంజో అందరం కలిసి తాగుదాం. రా.... తమ్ముడూ!.

ఓడ కదిలి వెళ్ళేంతవరకు ఆయన పిలుస్తూనే వున్నాడు.

ఈ హృదయ విదారకమైన సంఘటన ఆయన్ను కలచివేసిందని తరచుగా నాతో చెప్పేవాడు ట్రాయ్.

సైగాన్‌లో ఒక రిక్షాడ్రైవర్‌గా జీవనం పోసుకున్నాడు. వేరే పని నేర్చుకోడానికి వ్యవధి చాలలా. ఎక్కినవాళ్ళను అనవసరంగా చుట్టూ తిప్పడం వలన ఇవ్వాల్సిన చార్జీ డబ్బులు తగ్గించి ఇచ్చేవాళ్ళు.

ఒకసారి బండిఎక్కాడు ఒకతను. కొంతదూరం పోయి అతన్నే దారి అడిగాడు ట్రాయ్. అతనికి చర్రున కోపం వచ్చింది. మండిపడ్డాడు. వెంటనే బండి దిగి ఒక్కసెంటు కూడా ఇవ్వకుండా వేరే బండి చూసుకున్నాడు.

ఒక్కోసారి తిండికి కూడా వచ్చేదికాదు. అప్పట్లో ఆయన జీవితం కష్టాలమయం. విషాదకరంగా గడిచింది.

ఒక సమయంలో నాతో ఇలా అన్నాడు.

'ముసలి వాళ్ళకు సరే పని చేసుకోడానికి శక్తిలేదు. నేను యువకుణ్ణి. పొద్దస్తమానం ఎడతెరిపి లేకుండా రెక్కలుముక్కలు చేసుకొని పనిచేసినా తిండికి సరిపోయేదికాదు.'

కొంతమంది భాగ్యవంతులున్నారు. మూల్గుతోన్న డబ్బుతో ఏమి చేయాలో వాళ్ళకే తోచదు. ఈ ఆలోచన ఆయన్ను బాగా కుదిపివేసింది.

ఉదాహరణకు రిక్షా యజమానిని చూడండి. పేదవాళ్ళకు బండ్లు అద్దెకిస్తాడు. వాళ్ళేమో కడుపులో చల్ల కదలకుండా ఇంటిలో కూర్చుంటారు. మంచి భోజనం, విలువైన దుస్తులు అనుభవిస్తున్నారు. రిక్షా డ్రైవర్లను ప్రతినిత్యమూ బెదిరిస్తూ అవమానపరుస్తూ న్యాయంగా పొందగలిగిన దానికంటే అధికాధికంగా వాళ్ళ నుంచి యజమానులు దోచుకుంటున్నారు.

కొంతకాలంపాటు ఇలాగే గడిచిపోయింది. ట్రాయ్ దూరపు బంధుత్వంలో ఒకాయన వరసకు మావ అవుతాడు. ఎలక్ట్రీషియన్ అప్రెంటిసు ఇప్పించాడు. రెండు కంపెనీల్లో పనిచేయడంవల్ల తినడానికి చాలినంత ముట్టేది.

అక్కడ వదిలించుకొని, యన్‌గాక్ఆన్ కంపెనీలో చేరాడు.

ఎండ కాగడానికి మాకు ప్రత్యేకించిన సమయం కాస్తా అయిపోయింది. కొట్లలోకి వెళ్ళవలసిందిగా వార్డర్లు అరిచారు.

తర్వాత మళ్ళీ ఒకసారి మేము కల్సుకోవడానికి అవకాశం కలిగింది. నాతోటి ఖైదీలు ట్రాయ్‌ని గురించి ఇంకా చెప్పమని అడిగారు. నాకు కాస్త బిడియం కలిగింది.

'ఎక్స్' సోదరి ఇంతకు ముందొకసారి ఇలా చెప్పింది.

'గొప్ప కామ్రేడ్ల జీవితాలు, పోరాటాలను గురించి చెప్పడం వల్ల జైళ్ళల్లో అనేక విధాల చిత్రహింసలకు గురౌతున్న మన మిత్రులకు మరింత ఉత్తేజం, ప్రోత్సాహం కలిగిస్తాయి. శత్రువులపైన ద్వేషం ఇనుమడింపచేస్తాయి. ఇంకా ట్రాయ్ వీరోచిత కృత్యాలను గూర్చి వినాలనీ, ఆయన్ను అనుసరించాలని కోరతాను. 'డాంగ్ సోదరా', అని ఒక పాట ఉంది. అలాగే ట్రాయ్ సోదరుణ్ణి గురించి కూడా ఒక పాటను జైల్లో నేర్చుకోవాలి.

◆◆◆

ఒక రోజు తాకీదు అందింది పోలీసు వాళ్ళను కలుసుకోవాలని, ఆ విధంగానే వాళ్ళను కలిశాను. ఇలా అడిగారు.

'నీ భర్తను చూడాలని ఉందా?'

'అవును, ఏ సమయంలోనైనా ఆయన్ను చూడాలని ఉంది' అన్నాను.

'ఒక షరతు. అతడు తన నేరాన్ని ఒప్పుకునేటట్లు నువ్వు ఒత్తిడి తేవాలి'

నేను మౌనంగా ఉండిపోయాను. భార్య మెతకదనం ద్వారా భర్తపైన ఒత్తిడి చేయించే ట్రిక్ పోలీసులు పన్నుతారని 'ఎక్స్' సోదరి పలుమార్లు నాతో చెప్పింది. ఈ ట్రిక్‌నే నా మీదా ప్రయోగించారిప్పుడు.

హడావుడిగా నన్ను తీసుకెళ్ళారు. భోజనం కొని తీసుకెళ్ళడానికి కూడా వ్యవధి లేదు.

ఆసుపత్రిలో కొంతకాలం విశ్రాంతి తీసుకున్నాడు గదా కొంచెం బలం పుంజుకొని ఉంటాడని ఆశించాను. కిందటి దఫా చూచినప్పుడు ఎలా వున్నాడో ఇప్పుడు అలాగే ఉన్నాడు. శరీరం తెల్లగా పాలిపోయింది. తలవెంట్రుకలు బాగా పెరిగి చెవులను కప్పేశాయి. వరి కోసిన తర్వాత మిగిలే మొదళ్ళ వలె దట్టంగా పెరిగివుంది గడ్డం. ఆయన్ను బాగా మట్టికొట్టి ఉంది. నీలిరంగు చారలు చేతుల మీద నుంచి పరిగెత్తుతున్నట్లున్నాయి. ఆయన మృదువైన హస్తాలతో నా గౌను చేతులను పట్టుకున్నాడు. దగ్గరకు లాక్కొని కూర్చోబెట్టుకున్నాడు.

ఇలా అన్నాడు :

"నేను బాగున్నాను. చాలా బాగున్నాను కదూ!'

ఆయన ఎద దిగంబరంగా ఉంది. చమటతో తడిసిన ఒక గుడ్డతో శరీరం కప్పుకొని వున్నాడు. తైల సంస్కారంలేని జుత్తు ముఖం మీద పడింది. నాచేతి వేళ్ళతో ఆ వెంట్రుకలను చిక్కు తీస్తు ఇలా అడిగాను.

'ఏమైనా కొంచెం ఫర్వాలేదనుకొంటున్నారా?

(మిగతాభాగం వచ్చేవారం)

చూద్దామా

చుక్కల సాక్షిగా అడవి తల్లికి వందనం



ఎడక్కల్ గుహలకు ఎక్కాల్సిన నిలువెత్తు కొండ

తెల్లవారుజాము నాలుగున్నరకు ఏమైతే అదైందని మెల్లగా తలుపు తీసేసరికి ఒక జింకల గుంపు గది ముందే తిరుగుతోంది. కాసేపు అటూ ఇటూ తచ్చాడి ఆ గుంపంతా మెల్లగా అడవిలోకి వెళ్లిపోయింది. కళ్లు విప్పార్చి మరీ (చీకటి కదా!) చూశాం. రెడీ అయ్యాక బైటికొచ్చేసరికి రూమ్ ముందే ఓ ఏనుగు, అడవి దున్న, జింకలు, లంగూర్‌లనబడే నల్లముఖం కోతులు, నెమళ్లు, అడవి పందులు... చాలా కేజువల్‌గా తిరిగేస్తున్నాయి. అదంతా చూస్తుంటే మనమేమైనా కార్టూన్ సినిమాలో పాత్రధారులమా అన్న అనుమానం వచ్చింది (బొబ్బిలిరాజా సినిమాలోలా!). ఇంతలో పక్కనే వున్న ఇళ్లలోంచి ఆదివాసీ మహిళలు వచ్చి గడ్డిలో ఏదో ఏరుకుంటున్నారు. వెళ్లి అడిగితే జింకల పేడ. దాంతో వాళ్లు ఇల్లు అలుక్కుంటారంట. సర్సరి...మరి తర్వాత మా టూర్ విశేషాల్లోకి వెళ్దామా...

- కె. అరుణ

తరువాత వ్యాన్ సఫారీకి వెళ్లాం. అక్కడే ఎలిఫెంట్ సఫారీ కూడా వుంది. మనమంతా ఏనుగుమీద సవారీచేసి ఆ మూగజీవిని బాధపెట్టడమెందుకు అనే భూతదయతో వ్యాన్ సఫారీని ఎంచుకున్నాం. (నిజం చెప్పాలా?! దానికి టికెట్స్ దొరకలేదు) సఫారీకి బయల్దేరే ముందే అన్ని జంతువులనూ చూసేసిన ఫీలింగ్! అయినా ఇంకేం కనిపిస్తాయో అనే ఆత్రం. సఫారీలో కళ్లెంత చికిలించుకున్నా లాభం లేకపోయింది. చెట్టూ పుట్టా (నిజంగానే దారంతా బోలెడన్ని పుట్టలు) తప్ప మరేమీ కనిపించలేదు. కాకుంటే ఏనుగుల పేడకళ్లు చాలా కనిపించాయి. గుర్తుందా?! రాజేంద్రుడు-గజేంద్రుడులో కోట శ్రీనివాసరావు దాన్ని ఓ గది నిండా దాచి వుంచుతాడు. సఫారీ పూర్తవుతున్నా ఒక్క జంతువు కనపడితే ఒట్టు! దిక్కులు చూస్తుంటే వ్యాన్ మీద, "జంతువులు కనిపించడం అనేది మీ అదృష్టం మీద ఆధారపడి వుంటుంది. అందుకు మేం బాధ్యులం కాదు" అని కనిపించింది. ఔరా! ఫారెస్ట్ డిపార్ట్‌మెంట్‌వాళ్ల ఎంతటి ఘటికులు! వారికెంతటి ముందుచూపు!

ఇంతలో ఓ పే...ద్ద లేళ్ల గుంపు. బంగారు రంగు దేహంపై తెల్లటి చుక్కలు... ఎంత బాగున్నాయంటే చెప్పతరం కాదు. అయినా మా ఎదురుచూపులన్నీ పులికోసమయ్యే! కానీ ఎక్కడా వ్యాఘ్రదర్శనం కాలేదు. బహుశా అడవి లోపల వున్నాయేమో! క్రూరమృగాలకు దూరంగా వుండాలనేది రూల్ కదా! మరి వాటి దృష్టిలో క్రూరమృగాలు మనమేనేమో! లేకుంటే 'సేవ్ టైగర్' అనే స్లోగన్లు ఎందుకు పుట్టుకొస్తాయి? వాటి మనుగడ ఎందుకు ప్రశ్నార్థకమవుతుంది? కనుక పులులు ఆ మాత్రం జాగ్రత్తపడటం సబబేనేమో!

సఫారీ పూర్తయ్యాక ఎలిఫెంట్ ఫీడింగ్ సెంటర్‌కు చేరాం. ఇటు పెద్ద ఏనుగుల కోసం పెద్ద లిస్టే వుంది. ఏనుగుల వయసు, పనిని బట్టి ఆహారం (పనికి ఆహారపథకం అన్నమాట). ఆ లిస్టు ఎదురుగా ఐటమ్స్. అచ్చు పోసిన రాగి, అన్నం ముద్దలు, బెల్లం, కొబ్బరి, ఉప్పు వగైరాలు రెడీ. ఎనిమిదిన్నర అయిందో లేదో అన్ని దిక్కులనుంచీ శివ, సత్యం, విల్సన్, సంతోష్(ఇవన్నీ ఏనుగుల పేర్లు) ఒక్కసారిగా కమ్ముకున్నాయి. మావటీలు మెల్లగా దిగి ముద్దలన్నీ కలిపి పే..ద్ద ముద్ద చేశారు. తీసుకొచ్చి ఒకేసారి నోట్లో పెట్టారు. ఆ ఏనుగులన్నీ బఠానీలు తిన్నంత కులాసాగా ఆ ముద్దలను చపచపా నమిలేసి, రెండో ముద్దకోసం ఎదురుచూడ్డం... భలే చిత్రమనిపించిందిలే!

తరువాత మోయర్ బేలెన్సింగ్ రిజర్వాయర్. అక్కడి వండర్ ఏంటంటే మోయర్ జలపాతం నుండి పారే నీటిని కొద్దిగా దారి మళ్లించి... ఇక్కడ విద్యుత్ ఉత్పత్తి చేస్తున్నారు. ఈ విద్యుత్తు మొత్తం కోయంబత్తూరుకు సరిపోతుంది. హ్యాట్సాఫ్ టు మోక్షగుండం విశ్వేశ్వరయ్య! ప్రజా ప్రయోజనాలు, వారి అవసరాలు గుర్తించి అందుకు అనుగుణంగా ప్రణాళికలు వేసిన ఆనాటి మహానుభావులెక్కడ? ప్రాజెక్టుల పేరిట బొక్కడం, బొక్కసాలు నింపుకోవడం, ఒకరినొకరు దుమ్మెత్తిపోసుకోవడమే తెలిసిన నేటి నాయకులెక్కడ? నక్కకూ నాగలోకానికీ వున్నంత వ్యత్యాసం లేదూ?!

అక్కడి 'వించ్‌హౌస్' ఎదురుగా ఓ పే.....ద్ద శిఖరం. ఆ శిఖరం కనుచూపు మేరంతా అలలు అలలుగా మడతలు పడి చాలా పొడవుగా వుంది.



అలనాటి గిరిజనుల వస్తువులు



కురువా ద్వీప సమీపాన కబని నదీ పరవళ్లు

ఇంతలో మరో విషయం తెలిసింది. ఆ కొండ వున్నది కర్నాటకలోనట. రెండు రాష్ట్రాలనూ విడదీస్తూ మధ్య లోతైన లోయలో మోయర్ ప్రవాహం లీలగా కనిపిస్తుంది. దానికి మించిన మరో ఝలక్ ఏంటంటే... అవి సత్యమంగళం అడవులట! అంటే గుర్తుందిగా! అది ఇరు రాష్ట్రాలనూ గడగడలాడించిన బక్క పలచని మీసాల వీరుడు వీరప్పన్ ఒకప్పటి అడ్డా!

సరే! బందిపూర్ అడవులకు చేరామా! అంతా కొత్తగా వుంది. అప్పటిదాకా అడవుల్లో తిరిగామేమో కమర్షియాలిటీకి మారుపేరుగా వున్న ఆ వాతావరణం నచ్చలేదు. సఫారీకెళ్తే అసలైన అడవి చూసేవాళ్లమేమో! కానీ అందుకు మనస్కరించలేదు. ఫలితం, అరగంటలోనే బ్యాక్ టు ది తెప్పకాడు! అత్తగారింటికెళ్లిన కొత్తల్లుడు అలిగి గుమ్మంలోంచే తిరిగొచ్చేసినట్లే అనుకోండి! దారిలో నెమళ్లు, జింకలు మనసు కోరుకునే ఆహ్లాదాన్ని పంచాయి. తెప్పకాడుకు చేరాక చెక్కలతో కట్టిన 'లాగ్‌హౌస్' వద్దకు చేరాం.

నిజంగా అది జీవితంలో మరువలేని, మరపురాని సాయంత్రం. ఓ పక్క సెలయేరు, మరోపక్క అల్లిబిల్లిగా అల్లుకున్న విశాలారణ్యం, పర్ణశాల ముందు తిరుగుతున్నట్లు గెంతులేసే జింకలు, నెమళ్లు, టర్కీలు, నీటిని తొండాలతో ఎత్తిపోసుకునే అల్లరి ఏనుగులు, మత్తెక్కించే అడవి పరిమళాలు, అంతలోనే నల్లగా కమ్ముకున్న మేఘం... ఓహ్! ఎటుచూసినా సూదంటురాయిలా ఆకర్షించి ఆకట్టుకునే దృశ్యాలు. ఇక చూపు తిప్పుకోవడం మానవమాత్రుని వల్లయ్యే పనేనా! నెవర్! ప్రకృతిలో వినిపిస్తున్న వేణుగానాన్ని మనసు పొరల్లో భద్రంగా దాచుకున్నాం. మెల్లగా ఆ అడవి మధ్యనుంచి జింకల పక్కగా, నెమళ్లతో పాటుగా నడక సాగించాం. ఆ నడక అలా అలా ఆదివాసీల ఇళ్ల దగ్గర ఆగింది. పొద్దున్న వారు తీసుకెళ్లిన మేకపేడతో అలుక్కున్న నున్నటి గుడిసెలు చూడముచ్చటగా వున్నాయి. వారి జీవనశైలిని చూసి గెస్ట్‌హౌస్‌కు చేరాం. కానీ లోపలికి వెళ్లలేదు.

మౌనంగా ఆ అడవి ముంగిట కూర్చున్నాం. కాసేపటికే ఆత్మీయులను పలకరించడానికా అన్నట్లు పెద్ద జింకల గుంపు మా ముందుకొచ్చింది. మెల్లగా అడవంతా చిక్కటి చీకటి అలుముకుంది. దూరంగా కొండల్లో మనుషుల అస్తిత్వానికి గుర్తుగా మినుకుమినుకుమంటూ దీపాలు. అంతలోనే ఆకాశంలో తారలు తళుక్కుమన్నాయి. మనకు నిత్యం చుక్కల్ని చూసేంత స్థలమూ లేదు, సమయమూ లేదు. చూసినా ఆకాశం కాటుక రంగులో వుండదు (తెలుసుగా, పొల్యూషన్ ప్రాబ్లెమ్!). చుక్కలు ఇంత నిండుగా చమక్కుమనవు. ఎంత నాశనంచేసినా ఆగ్రహించక మన ప్రాణాలు నిలిపే ప్రాణవాయువును అందించడం తల్లిలాంటి ప్రకృతికే సాధ్యమేమో! అందుకు శిరసువంచి వందనాలు సమర్పిస్తున్నట్లుగా సన్నగా చినుకులు పడుతున్నా లెక్కచేయక అలాగే కూర్చుండిపోయాం. ఆ అమ్మ ఆప్యాయతలో తడిసి ముద్దయిపోయాం.

మర్నాడు పొద్దున్నే బయల్దేరి కేరళలోని వయనాడ్ జిల్లాలో ప్రవేశించాం. మతుంగ అడవులమీదుగా ఎడక్కల్ గుహలకు చేరాం. అది ఓ నిలువెత్తు కొండ. సరైన మెట్లుండవు. ఎగుడు దిగుడు రాళ్లపై ఒకరి వెనుక ఒకరు మెల్లగా ఎక్కాలి. ఒకరు పడ్డారంటే కనీసం పదిహేనుమందయినా హరీమనాల్సిందే! బహుశా ఆ భయం అందరిలోనూ వుందనుకుంట (ప్రాణమంటే ఎవరికైనా తీపేగా)! అందరూ ఒళ్లు దగ్గర పెట్టుకుని ప్రతి అడుగూ ఆచితూచి వేశారు. పైకెక్కాక ఇంత ఎత్తు మనం ఎక్కామా అనే ఆశ్చర్యం. కిందికి చూస్తుంటే కళ్లు తిరిగినంత పనైంది. పర్వతారోహణ పూర్తిచేసిన ఫీలింగ్. ఆ గుహలో ఆదిమానవునికి గుర్తుగా రాతలు, చక్రాలు, సింహాకృతుల బొమ్మలున్నాయి. ఇవి చాలా ముఖ్యమైనవి. ఎందుకంటే, భారతదేశమంటే ఆర్యులేననీ, వారే ద్రవిడులకు నాగరికత నేర్పారనీ కొందరి వాదన! దాన్ని ప్రశ్నిస్తున్నట్లుగా, ద్రవిడులకూ నాగరికత వుంది. ఇక్కడా సంస్కృతి అభివృద్ధి చెందిందని చెప్పడానికి ఈ కుడ్యచిత్రాలు బలమైన తార్కాణం. హిందువులంటే ఆర్యులేకాదు, ద్రవిడులు కూడా! వారూ ఆదినుంచీ భారతంలో మనగలిగారని నిరూపించే స్పష్టమైన రుజువులివి! ఆ మెట్ల(!) భయానికి కొండ దిగాక కానీ ఊపిరి పీల్చుకోలేదు. ఇంత గుండె దడలోనూ ఆశ్చర్య మనిపించింది ఏంటంటే... ఒక అంధ యువకుడు ఆ కొండ ఎక్కుతూ ఎదురయ్యాడు. గ్రేట్ కదా?! వీరిలో దేన్నయినా సాధించాలనే తపన, తమను తాము రుజువు చేసుకోవాలనే పట్టుదలా ఎక్కువ. అందుకే విజయం వారి పక్షాన నిలుస్తుంది. వారితో పోలిస్తే అన్ని అవయవాలు వున్నవాళ్లే బద్ధకస్తులనాలి. తరువాత అంబల్‌వాయల్‌లోని హెరిటేజ్ మ్యూజియం చూసి కురువా ద్వీపానికి చేరాం. అక్కడి కబని నదీ అందాలను ఆస్వాదించాక... చీకటిపడే సమయానికి కరప్పూజ డ్యామ్ చేరుకున్నాం. సంజె చీకట్లు నలువైపులా పరుచుకుంటోంది. ఆ కెంజాయి రంగుల్లో ఆ డ్యామ్ అందాలను కాంచడం కొంగ్రొత్త అనుభూతి.

కేరళలో దారంతా ప్యాలెస్‌ల్లాంటి ఇళ్లు ఎక్కువగా కనిపిస్తాయి. మీరో జోక్ వినే వుంటారు. ఎవరెస్ట్‌ను అధిరోహించిన టెన్సింగ్ జెండా పాతడానికి వెళ్లేసరికి అక్కడో మళయాళీ 'చాయ్' అమ్ముతూ కనిపించాడట! ఉదర పోషనార్థం మళయాళీలు ఎక్కడికైనా సరే తెగించి వెళ్లిపోతారు. అందుకే ఎక్కడైనా సరే వాళ్లు కనిపిస్తారనడానికి ఆ జోక్. మనకైనా చూడండి, నర్సులు, టీచర్లు ఎక్కడచూసినా వాళ్లే! అలాగే విదేశాల్లో... ముఖ్యంగా గల్ఫ్‌లో వారే ఎక్కువ. అలా ఆర్జించిన సంపాదనకు ప్రతిబింబాలీ విల్లాలు. ఒకదాన్ని మించిన మోడల్ మరోటి. అదీ చిన్నపిల్లలు ఇళ్ల బొమ్మలకు రంగులేస్తారే... అలా మనం కలలో కూడా ఊహించని డార్క్ కాంబినేషన్లు. ఇల్లు ఎంత పెద్దదైనా సరే, పైన మాత్రం పెంకులు పరిచినట్లుండే నిర్మాణం. బహుశా ఆ ఏర్పాటు అక్కడ వర్షాలు ఎక్కువ కనుక నీళ్లు సులువుగా జారిపోవడానికి మాత్రమే కాదేమో... వారి పురాతన సాంప్రదాయాన్ని వదల్లేని మక్కువ కూడానేమో!

★



తెప్పకాడు అటవీప్రాంతం

అట్టమీది కథ



అమెరికన్ కౌబాయ్ ఎందుకొచ్చాడు?

అమెరికన్ కౌబోయ్ బరాక్ హుస్సేన్ ఒబామా తన పదిరోజుల ఆసియా పర్యటనలో భాగంగా మన దేశ పర్యటనలో ఉన్నారు. శుక్రవారం నాడు అమెరికా నుంచి బయలుదేరి ఆరవ తేదీన ముంబైలో అడుగుపెట్టారు. గడిచిన ఆరు దశాబ్దాలలో మన దేశాన్ని ఐదుగురు అమెరికా అధ్యక్షులు సందర్శించారు. ఆరవ వ్యక్తిగా బరాక్ ఒబామా ఈనెల 6-9 తేదీలలో పర్యటన జరుపుతున్నారు. మన పదమూడు మంది ప్రధానుల్లో (గుల్జారీలాల్ నందా తాత్కాలిక ప్రధానిగా రెండుసార్లు చేశారు. ఆయన్ని కూడా లెక్కిస్తే 14 మంది) నెహ్రూతో సమంగా మన్మోహన్‌సింగ్ అమెరికాను ఎక్కువసార్లు సందర్శించి రికార్డులకెక్కారు. 1947-1980 మధ్య 33 సంవత్సరాలలో ముగ్గురు ఐషెన్‌హోవర్ (1959), రిచర్డ్ నిక్సన్ (1969), జిమ్మికార్టర్ (1978) రాగా... 2000 నుంచి 2010 మధ్య పది సంవత్సరాల్లోనే ముగ్గురు బిల్‌క్లింటన్ (2000), జార్జి బుష్ (2006), బరాక్ ఒబామా (2010) వచ్చారు. ఇదే సమయంలో 1947 నుంచి 1984 మధ్య కాలంలో మన ముగ్గురు ప్రధానుల్లో ఇద్దరు ఆరుసార్లు అమెరికా వెళ్లారు. ఆ తరువాత కాలంలో మన ప్రధానులు పదకొండు సార్లు అమెరికా వెళ్లారు. ఉభయదేశాల మధ్య వచ్చిన మార్పుల తీరుతెన్నులకు ఇది నిదర్శనం. ఇంతకూ ఒబామా మన దేశానికి ఎందుకు వస్తున్నారు? ఈ పర్యటన వలన కలిగే లాభనష్టాలేమిటి? అన్న అంశాలు సహజంగానే చర్చకు వచ్చాయి.

- ఎం. కోటేశ్వరరావు

స్వాతంత్ర్యం వచ్చిన తరువాత మన పాలకులకు అమెరికాపై పెద్ద మోజు ఉన్నప్పటికీ పాకిస్తాన్‌కు ఆయుధాలిచ్చి మనకు వ్యతిరేకంగా నిలబెట్టటం, మనకు అవసరమైన పెట్టుబడులు, సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించేందుకు తిరస్కరించటం, కాంగ్రెస్ నాయకులపై అమెరికన్లు విశ్వాసం లేకపోవటం వంటి అనేక కారణాలు మన దేశాన్ని అమెరికాకు దూరంగా ఉంచాయి. వాటితోపాటు సామ్రాజ్యవాద వ్యతిరేక కబుర్లు చెప్పి, అలీన విదేశాంగ విధానం ప్రకటించి వెంటనే అమెరికాకు దగ్గర కావటం కుదిరేది కాదు. అన్నింటి కంటే 1950 దశకంలో ప్రపంచంలో సామ్రాజ్యవాద వ్యతిరేక వెల్లువ కారణంగా సోషలిస్టు, అభ్యుదయవాదులుగా చెప్పుకున్న కాంగ్రెస్ నేతలు ఇష్టం లేకున్నా అమెరికా వ్యతిరేక వైఖరిని తీసుకోక తప్పలేదు. నెహ్రూ తన పాలనా కాలంలో సోవియట్ కంటే అమెరికా పర్యటనలే ఎక్కువ జరిపారు. అమెరికా విషయానికి వస్తే పెత్తందారీ, దురహంకారం, నయానా, భయానా మన దేశాన్ని లొంగదీసుకొనేందుకు నిరంతరం ప్రయత్నించింది. అందుకే సంబంధాలు సజావుగా లేనప్పుడు కూడా అమెరికన్ అధ్యక్షులు మన దేశానికి పర్యటనకు వచ్చారు.

1947-1969 మధ్య కాలంలో నెహ్రూ ఐదుసార్లు అమెరికా పర్యటన జరిపితే సోవియట్‌కు రెండుసార్లు మాత్రమే వెళ్లారు. అలీన విధానాన్ని ప్రకటించినప్పటికీ



ప్రణబ్‌తో బుష్...

స్వాతంత్ర్యం వచ్చిన 14 సంవత్సరాల తరువాతే 1961లో ప్రపంచ అలీన దేశాల ఉద్యమం ప్రారంభమైంది. అమెరికా మన దేశాన్ని తన శిబిరంలోకి రప్పించుకొనేందుకు నిరంతరం ప్రయత్నిస్తూనే ఉంది. అలీన ఉద్యమ ప్రారంభకుల్లో ఒకటిగా మన దేశం ఉన్నప్పటికీ తన కమ్యూనిస్టు వ్యతిరేక కుట్రలో మనల్ని ఉపయోగించుకొనేందుకు ఐషెన్ హోవర్, కెన్నడీ ప్రయత్నించారు. దానిలో భాగంగానే చైనాతో ఉన్న సరిహద్దు వివాదాన్ని ఆసరా చేసుకొని మన దేశానికి మిలిటరీ, ఇతర వ్యూహాత్మక సహాయం చేయటం, 1962లో చైనాతో ఘర్షణకు పురికొల్పటంలోనూ అమెరికా పాత్ర ఉంది. తరువాత కాలంలో అమెరికన్లు పాకిస్తాన్‌కు మరింత చేరువయ్యారు. కెన్నడీ హయాంలో భారత్‌ను దరిచేర్చుకొనేందుకుగాను బొకారో ఉక్కు కర్మాగారం ఏర్పాటుకు సాయం చేస్తామని వాగ్దానం చేసింది. తరువాత మాట తప్పింది. అంతేకాదు తాము దెబ్బతీయాలనుకున్న కమ్యూనిస్టు చైనాను గుర్తించటంతో పాటు దానితో సంబంధాలను పెట్టుకొనేందుకు ప్రాధాన్యత ఇచ్చారు. అందితే జుట్టు లేకుంటే కాళ్లు అంటే ఇదే.

1970 దశకం ప్రారంభంలో పాకిస్తాన్‌లో అంతర్యుద్ధం, బంగ్లా విముక్తి ఉద్యమానికి భారత్ మద్దతు, భారత్‌ను బెదిరించేందుకు అమెరికా సప్తమ నౌకాదళాన్ని దించటం, సోవియట్‌తో భారత్ రక్షణ ఒప్పందం వంటి పరిణామాలు జరిగాయి. వాటి కొనసాగింపుగానే మన దేశం 1974లో పోఖ్రాన్ అణుపరీక్ష జరిపింది. దాంతో అమెరికా మనపట్ల మరింత శత్రువైఖరి తీసుకొని అనేక ఆంక్షలను విధించింది. అయితే అమెరికా ఆయుధ పరిశ్రమ వత్తిడి మేరకు మన దేశానికి ఆయుధ విక్రయంపై విధించిన నిషేధాన్ని 1975లో అధ్యక్షుడు గెరాల్డ్ ఫోర్డ్ ఎత్తివేయాల్సి వచ్చింది. ఆ తరువాత కార్టర్ 1979లో మన దేశ పర్యటనకు వచ్చాడు.

అమెరికా, ఐరోపా ధనిక దేశాల చెప్పుచేతల్లో ఉండే ప్రపంచబ్యాంకు, ఐఎంఎఫ్ ప్రభావంతో వాటి విధానాలను మన దేశం అమలు జరపటం, సోవియట్ యూనియన్, తూర్పు ఐరోపా దేశాలలో సోషలిస్టు వ్యవస్థలు కూలిపోవటం, ప్రపంచంలో అమెరికాకు ఎదురులేని పరిస్థితి ఏర్పడటంతో పరిణామాలు, పర్యవసానాలు వేగంగా మారిపోయాయి. ఇందిరా గాంధీ రెండవసారి అధికారంలోకి వచ్చిన తరువాత 1982లో అమెరికా పర్యటనకు వెళ్లి తారాపూర్ అణువిద్యుత్ కేంద్రానికి ఇంధనం, విడిభాగాల సరఫరాపై ఒప్పందం చేసుకున్నారు. తరువాత రాజీవ్ గాంధీ వెళ్లి శాస్త్ర, సాంకేతిక మార్పిడిపై ఒప్పందాలు, ద్వైపాక్షిక

నిక్సన్-ఇందిరా గాంధీ

రిచర్డ్ నిక్సన్ హయాంలో అమెరికా విదేశాంగ విధానం భారత్‌కు వ్యతిరేకంగా పాకిస్తాన్‌కు అనుకూలంగా ఉంది. అందువల్లనే అప్పుడు ప్రధానిగా ఉన్న ఇందిరాగాంధీ 1969లో నిక్సన్ పర్యటనలో ముక్తసరిగా వ్యవహరించారు. ఆ సమయంలో కాంగ్రెస్ అంతర్గత సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నది. పాత కాంగ్రెస్ - కొత్త కాంగ్రెస్‌గా చీలిపోయేందుకు రంగం సిద్ధమైంది. ఆ ఏడాది జూలై 16న నిక్సన్‌కు పంపిన వర్తమానంలో మీ పర్యటనలోగానే ఇందిరాగాంధీ రాజీనామా చేసే అవకాశం ఉందని విదేశాంగమంత్రి హెన్రీ కిసింజర్ పేర్కొన్నాడు.

విమానాశ్రయంలో దిగిన నిక్సన్‌కు సాదాసీదా స్వాగతం లభించింది. శాంతిబాటలు వేసేందుకు గల అవకాశాల గురించి భారత నాయకులతో చర్చించేందుకు తాను వచ్చినట్లు నిక్సన్ చెప్పాడు. వచ్చిన రోజు రాత్రే తాత్కాలిక రాష్ట్రపతి జస్టిస్ హిదయతుల్లా ఇచ్చిన విందుకు నిక్సన్ హాజరయ్యాడు. మరుసటి రోజు పొద్దునే పాకిస్తాన్ వెళ్లిపోయాడు. 1971 వచ్చేసరికి భారత ఉపఖండంపై నిక్సన్ దృష్టి సారించాడు. అదే ఏడాది ఇందిరాగాంధీ అమెరికా పర్యటన జరిపారు. అది కూడా ముక్తసరిగానే జరిగింది. స్వాగతం పలికిన నిక్సన్ బీహార్ వరదబాధితుల గురించి ప్రస్తావించాడుగాని లక్షలాదిమంది బంగ్లా కాందిశీకుల వలస, వారి ఇబ్బందుల గురించి పల్లెత్తు మాట లేదు. అయితే ఇందిరాగాంధీ తన ప్రతిస్పందనలో దాని గురించి నిక్సన్ ప్రస్తావించకపోవటాన్ని పరోక్షంగా తప్పుపట్టారు. దాంతో ఆగ్రహించిన నిక్సన్ మరుసటి రోజు అధ్యక్ష భవనంలో ఇందిరాగాంధీ గౌరవార్థం ఇచ్చిన విందుకు ఆమె వచ్చిన తరువాత 45 నిమిషాలు ఆలస్యంగా వచ్చి అవమానించాడు. కేవలం 17 నిమిషాలు మాత్రమే విందులో పాల్గొన్నాడు. తరువాత ఆమె పెద్ద నీతులు వల్లిస్తోందని తిట్టినట్లు, రాయటానికి వీల్లేని భాషను ఉపయోగించినట్లు, చిత్తకార్తె కుక్క, ముసలి మంత్రగత్తె అన్నట్లు కిసింజర్ తన జ్ఞాపకాలలో రాశాడు. వారి చర్చలు పరమ దరిద్రంగానూ, బాధాకరంగా జరిగాయని కూడా పేర్కొన్నాడు. కిసింజర్ కూడా తక్కువేమీ తినలేదు. ఆమె చిత్తకార్తె కుక్కైనా మరొకటైనా మనకు కావాల్సిందానిని సాధించుకోవాలని తాను చెప్పానని, అలా వర్ణించినందుకు తాను చింతిస్తున్నానని మన దేశం అమెరికాకు దగ్గరైన తరువాత 82 సంవత్సరాల వయస్సులో కిసింజర్ పేర్కొన్నాడు. ఇందిరాగాంధీని పచ్చిబూతులు తిట్టిన కిసింజర్ ఐదు సంవత్సరాల క్రితం 82 సంవత్సరాల వయస్సులో తనకు ఆమె అంటే ఎంతో ఉన్నత గౌరవం ఉందని ప్రకటించాడు. అలాంటి మాటలు ఉపయోగించినందుకు విచారపడుతున్నానని చెప్పాడు. మన దేశం అమెరికాతో వ్యూహాత్మక అణుఒప్పందం కుదుర్చుకున్న సమయం అది. విచారకరమైన విషయం ఏమంటే కాంగ్రెస్ అధికార ప్రతినిధి ఆనందశర్మ కిసింజర్‌లాంటి వ్యక్తి అలాంటి భాషను ఉపయోగించటం విభ్రాంతిని కలిగిస్తున్నప్పటికీ ఆ మాటలను ఇప్పటి అమెరికా నాయకులు కూడా తిరస్కరించారంటూనే ....'అయినా ఆ మాటలిప్పుడు అసంగతం' అని పేర్కొన్నారు.

పన్ను రాయితీల అవగాహన కుదుర్చుకున్నారు. 1991లో సోవియట్ యూనియన్ విచ్ఛిన్నం తరువాత భారత్-అమెరికా సంబంధాలు కొత్త పుంతలు తొక్కాయి. ఆర్థిక సంస్కరణలు కూడా అప్పుడే ప్రారంభమయ్యాయి. అంతకు ముందు కుదిరిన ఒప్పందాలకు అనుగుణంగా మన మార్కెట్‌ను అమెరికాకు తెరిచారు. అది ఎంతగా అంటే 1991లో అమెరికా ప్రత్యక్ష పెట్టుబడులు 11.3 మిలియన్ డాలర్లయితే 2004 నాటికి 344.4 మిలియన్ డాలర్లకు పెరిగాయి. రాజీవ్ గాంధీ తరువాత పివి నరసింహారావు కూడా అనేక ఒప్పందాలు చేసుకున్నారు. భారతీయ జనతాపార్టీ నాయకత్వంలోని ఎన్‌డిఏ హయాంలో 1998లో రెండవ అణుపరీక్ష జరపటంతో అమెరికా మరోసారి ఆంక్షలు విధించింది. ఎన్‌డిఏ హయాంలోనే మన దేశాన్ని అమెరికా జూనియర్ భాగస్వామిగా మార్చే వ్యూహాత్మక అణు ఒప్పందానికి పునాది పడింది. ప్రపంచ వాణిజ్య ఒప్పంద గడువుకు ముందే అమెరికా వస్తువులకు తలుపులను మరింత బార్లా తెరిచేందుకు వాజ్‌పేయి సర్కార్ తహతహలాడింది. దాని పర్యవసానమే 2000 సంవత్సరంలో బిల్ క్లింటన్ భారత పర్యటన. ఆయన అమెరికా వ్యూహాత్మక భాగస్వామిగా భారత్‌ను వర్ణించారు. క్లింటన్ పర్యటన రష్యన్ ప్రభావం నుంచి భారత్‌ను తప్పించే లక్ష్యంతో జరిగిందని రష్యన్ విశ్లేషకులు పేర్కొన్నారు. అమెరికా నూతన వ్యూహం భారత్-రష్యా స్నేహ ఒప్పందాన్ని ప్రభావితం చేయగలదని హెచ్చరించారు. మన రాష్ట్రంలో కూడా ఆయనకు నాటి చంద్రబాబు సర్కార్ బ్రహ్మరథం పట్టింది. సత్యం రామలింగరాజును ఆదర్శ



కె.ఆర్. నారాయణన్‌తో క్లింటన్..

పురుషుడిగా ఆయన సరసన కూర్చోపెట్టారు. భారత్ సర్కార్ అమెరికాతో జట్టు కట్టేందుకు సై అన్నది కనుక మరుసటి ఏడాదే పోఖ్రాన్ రెండవ అణుపరీక్ష సందర్భంగా విధించిన ఆంక్షలను తొలగించారు. క్లింటన్ కొనసాగింపుగా ఒప్పందంలో భారత్‌ను భాగస్వామిగా చేసేందుకు 2006లో బుష్ భారత పర్యటన జరిపాడు. అంతకు ముందు సంవత్సరం మన్మోహన్‌సింగ్ అమెరికా వెళ్లి అనేక ఒప్పందాలను కుదుర్చుకొని వచ్చారు. అమెరికాతో మన దేశం ఎంతగా దగ్గరైందంటే 2004 దాని ప్రత్యక్ష పెట్టుబడులు 344 మిలియన్ డాలర్లుంటే ఇప్పుడు 900 కోట్ల డాలర్లకు పెరిగాయి.

ఎక్కడన్నా బావగాని......

ఎక్కడన్నా బావ అంటే సరే గాని వంగతోట కాడ కాదన్నట్లుగా భారత్ గురించి అమెరికా ఎన్ని కబుర్లైనా చెప్పవచ్చు, పొగడవచ్చు. కీలకాంశాల విషయాలకు వచ్చేసరికి ఎలాంటి మార్పు లేదు. వివక్షాపూరితమైన అణ్వస్త్ర వ్యాప్తి నిరోధక ఒప్పందంపై సంతకం చేయాలని ఒబామాతో సహా వత్తిడి చేయని అధ్యక్షుడు లేడు. కాశ్మీర్‌ను భారత్ అంతర్భాగంగా గుర్తించలేదు. కాశ్మీర్ వివాదమే పాకిస్తాన్, ఆఫ్ఘనిస్తాన్‌లో అస్థిరతకు ఒక కారణమని బరాక్ ఒబామా చేసిన ప్రకటన అందుకు చక్కటి నిదర్శనం. ఇదే ఒబామా సర్కార్ తాజాగా ఉగ్రవాద వ్యతిరేక పోరు పేరుతో పాకిస్తాన్‌కు ఆధునిక ఆయుధాలు అందచేసేందుకు నిర్ణయించింది. ముంబై దాడులకు సూత్రధారి అయిన పాక్-అమెరికన్ జాతీయుడైన హెడ్లీని అప్పగించేందుకు అమెరికా

అమెరికాపై మోజు- ఆచరణలో భంగపాటు

1949 అక్టోబరు రెండవ వారంలో తొలి భారత ప్రధాని నెహ్రూ అమెరికాను సందర్శించి పరాభవం పొందారు. ఆయనకు ఇల్లినాయిస్ గవర్నర్ అడలాయ్ స్టీవెన్సన్ స్వాగతం పలికారు. అధ్యక్షుడు ట్రూమన్ నెహ్రూతో అంటీముట్టనట్లుగా వ్యవహరించాడు. అధ్యక్ష భవనంలో అధికారిక విందులో ట్రూమన్‌తో పాటు అప్పటి అమెరికా ప్రధాన న్యాయమూర్తి విందులో పాల్గొన్నారు. ఆ సమయంలో అమెరికాలో దొరికే పలురకాల విస్కీల గురించి మాట్లాడుకున్నారు తప్ప ఇరుదేశాధినేతల స్థాయి సమావేశంగా అది జరగలేదు. అంతకు ముందు కూడా మన దేశాన్ని అవమానించే విధంగా అమెరికన్లు వ్యవహరించారు. సోవియట్‌కు వ్యతిరేకంగా తమతో చేర్చుకోవాలనుకున్న అమెరికన్లు నెహ్రూ ఏది కోరితే దానిని ఇచ్చేందుకు తాము సుముఖంగా ఉన్నామని నాటి అమెరికా రాయబారి హెండర్సన్ మన రిజర్వుబ్యాంకు గవర్నర్ దేశముఖ్‌కు వర్తమానం పంపారు.ఆ సమయంలో మన దేశం తీవ్ర ఆహార సమస్యను ఎదుర్కొంటున్నది. ఈ విషయం తెలిసన నాటి మన విదేశాంగ కార్యదర్శి గిరిజా శంకర్ వాజ్‌పేయి నెహ్రూకు ఒక సలహా ఇచ్చాడు. ట్రూమన్‌తో చర్చల సందర్భంగా ఆహార సరఫరాల గురించి అడగమన్నారు. దానికి నెహ్రూ తిరస్కరిస్తూ తాను భిక్షాపాత్ర పట్టుకొని అమెరికా పోవటం లేదని మందలించాడు. నెహ్రూ అమెరికా వెళ్లి ఎలాంటి ఆర్థిక సహాయం అడగకుండా వట్టిచేతులతో తిరిగివచ్చాడని మన పెట్టుబడిదారులు విమర్శించారు. అమెరికన్లు మనలను తమ కాళ్లవద్దకు వచ్చే విధంగా చేసుకొనేందుకు ప్రయత్నించారు. 1951 సెప్టెంబరు 19న న్యూయార్క్ పర్యటన సందర్భంగా విజయలక్ష్మీ పండిట్ మాట్లాడుతూ తమ విదేశాంగ విధానం స్వేచ్ఛా దేశాలకు అనుగుణంగా ఉందంటూ ఐక్యరాజ్యసమితిలో జరిగిన 51 సమావేశాల్లో 38సార్లు మీ మాదిరి ఓటు చేశామని పదకొండు సార్లు గైరు హాజరుకాగా కేవలం రెండుసార్లు మాత్రమే వ్యతిరేకంగా ఓటు చేశామని చెప్పి అమెరికన్లను ప్రసన్నం చేసుకొనేందుకు ప్రయత్నించారు. ఆ తరువాత కొరియాపై అమెరికా దురాక్రమణ యుద్ధానికి పాల్పడింది. ఆ సమయంలో మన దేశం దక్షిణకొరియాకు అంటే అమెరికాకు మద్దతు ఇచ్చింది. ఉత్తర కొరియాను దురాక్రమణదారుగా చిత్రించి భద్రతామండలిలో మన ప్రతినిధి ఓటు వేశారు.



నెహ్రూతో అడలాయ్ స్టీవెన్సన్....

భారత్-అమెరికా సంబంధాలలో కొన్ని ఘట్టాలు

1941లో అమెరికా అధ్యక్షుడు రూజ్‌వెల్ట్ తన సామ్రాజ్యవాద బుద్ధిని బయట పెట్టాడు. బ్రిటీష్ ప్రధాని చర్చిల్‌కు పంపిన వర్తమానంలో 'ముందు భారత్‌ను కామన్‌వెల్త్ దేశంగా చేయాలి. తరువాత ఐదేళ్లో లేదా బహుశా పది సంవత్సరాల తరువాతో అది బ్రిటీష్ సామ్రాజ్యంలోనే ఉంటుందో లేక సంపూర్ణ స్వాతంత్ర్యం కోరుకుంటుందో ఎంచుకొనే అవకాశం ఇవ్వాలి' అని పేర్కొన్నాడు. ఈ మాత్రానికే అమెరికా మన స్వాతంత్ర్యానికి మద్దతు ఇచ్చిందని నాడు కాంగ్రెస్ నాయకులు సంబరపడిపోయారు.

1949లో అమెరికాపై మోజుతో పెద్ద ఆశలతో ప్రధానిగా తొలిసారి జవహర్‌లాల్ నెహ్రూ అమెరికా పర్యటన జరిపారు. అమెరికన్లు ఒక దేశాధినేతగా నెహ్రూకు ఇవ్వాల్సిన గౌరవ మర్యాదలు ఇవ్వలేదు.

1953లో చైనాతో ఆయుధాల తయారీకి ఉపయోగపడే వస్తువుల వ్యాపారం చేసే దేశాలకు తమ దేశం ఎలాంటి సాయం చేయదని ప్రకటిస్తూ అలాంటి దేశాలలో భారత్ కూడా ఉందని పేర్కొన్నది. కొరియా యుద్ధంలో అమెరికా వైఖరిని మన దేశం తప్పు పట్టినందుకు ఈ చర్య తీసుకున్నది.

1959లో ఐషెన్ హోవర్ మన దేశం వచ్చాడు. మన ప్రధాని నెహ్రూకు జరిగిన అవమానాన్ని దిగమింగుకున్న మన పాలకులు హోవర్‌కు బ్రహ్మరథం పట్టారు.

1960లో నాలుగు సంవత్సరాలలో 127 కోట్ల డాలర్ల విలువగల గోధుమలను పిఎల్-480 పథకం కింద అమెరికా నుంచి కొనుగోలు చేసేందుకు మన దేశం ఒప్పందం చేసుకుంది. ఇది తడిసి మోపెడై చివరకు డాలర్లలో రుణం చెల్లించలేని దుస్థితికి మన దేశాన్ని నెట్టారు. దీని కొనసాగింపుగానే 1966లో మన ప్రధాని ఇందిరాగాంధీ అమెరికా పర్యటనకు వెళ్లారు. పేరుకు స్నేహపూర్వక పర్యటన అని చెప్పినప్పటికీ అసలు లక్ష్యం ఆహారం, విదేశీ మారక ద్రవ్యం డాలర్లను తెచ్చేందుకే. ఆ డాలర్లు చెల్లించలేకే తరువాత కాలంలో ప్రపంచబ్యాంకు, ఐఎంఎఫ్ షరతులను అంగీకరించి అప్పులు తీసుకోవటం ఇందిరాగాంధీ హయాంలో ప్రారంభమైంది.

1969లో రిచర్డ్ నిక్సన్ మన దేశంలో పర్యటించాడు. ఇష్టంలేని ఆ పర్యటన ముక్తసరిగా కేవలం ఒక్క రోజు మాత్రమే జరిగింది. వియత్నాంపై తన దాడులకు భారత్ మద్దతు కూడగట్టేందుకు ప్రయత్నించి విఫలమయ్యాడు.

1979లో జిమ్మీ కార్టర్ భారత పర్యటన జరిపారు. హర్యానాలో ఆయన సందర్శించిన ఊరి పేరును 'కార్టర్‌పురి'గా మార్చారు. అంతకు ముందు మన ప్రధాని మొరార్జీ దేశాయ్ అమెరికా వెళ్లి వచ్చారు.

1985లో రోనాల్డ్ రీగన్ అధ్యక్షుడిగా ఉన్న సమయంలో ప్రధాని రాజీవ్‌గాంధీ తొలి అమెరికా పర్యటన జరిపారు.

2000 సంవత్సరంలో 'ఆట తీరును మార్చే పర్యటన' పేరుతో బిల్‌క్లింటన్ మన దేశ పర్యటన జరిపారు. మన రాష్ట్రం కూడా వచ్చారు.

2005లో ప్రధాని మన్మోహన్‌సింగ్ అమెరికా వెళ్లి అణుఒప్పందంపై సంతకాలు చేశారు.

2006లో జార్జి బుష్ మన దేశ పర్యటనకు వచ్చారు.

2009లో ప్రధాని మన్మోహన్ సింగ్ అమెరికా వెళ్లారు. ఆరు దశాబ్దాల క్రితం నెహ్రూ పర్యటన మాదిరి ఉందని ఒబామా వర్ణించారు.

2010 నవంబరులో ఒబామా భారత పర్యటనకు వచ్చారు.



అంగీకరించకపోవటాన్ని బట్టి మనకు వ్యతిరేకంగా ఉగ్రవాదులకు అది ఆశ్రయం ఇస్తున్నట్లు వేరే చెప్పనవసరం లేదు. ఇదే విధంగా పొరుగుసేవల విషయంలో కూడా ఒబామా భారత్‌పై ధ్వజమెత్తిన విషయం ఇంకా సమసిపోలేదు. భద్రతా మండలిలో శాశ్వత సభ్యత్వం కావాలన్న మన డిమాండ్‌ను ఇంతవరకు అమెరికా అంగీకరించలేదు. భారత్‌తో కలిసి ఐ.రా.స సంస్కరణలకు కృషి చేస్తామని మాత్రమే తాజాగా స్పష్టం చేసింది.

ఒబామాకు ఎందుకింత ఆసక్తి?

ఒబామా ఎందుకు మన దేశంపై ఆసక్తి చూపుతున్నాడు? పదిరోజుల ఆసియా పర్యటనలో మూడున్నర రోజులు ఎందుకు మన దేశంలో ఉంటున్నాడు? రెండువందలకు పైగా కార్పొరేట్ సంస్థల ప్రతినిధులతో రెండు రోజుల పాటు ముంబైలో తిష్టవేయటం వెనుక ఆంతర్యం ఏమిటి? దీనికి సమాధానం చెప్పటం చాలా సులభం. ఆర్థిక సంక్షోభం నుంచి ఇంకా అమెరికా బయటపడలేదు. అదెంతటి ప్రభావం కలిగించిందో ఈనెల రెండున అక్కడ జరిగిన ఎన్నికలలో అధికార డెమోక్రటిక్ పార్టీకి తగిలిన చావుదెబ్బలు నిరూపించాయి. కనీసం తమ దేశంలో లక్ష ఉద్యోగాలను కల్పించేందుకు అవసరమైన ఆయుధాలు, ఇతర వస్తువులు అమ్మాలన్నది ఒబామా లక్ష్యం. అమెరికాలోని పాత అణువిద్యుత్ ప్లాంట్లను మనకు అంటగట్టేందుకు, దాదాపు 1500 కోట్ల డాలర్ల మేర ఒప్పందాలు చేసుకోవాలని చూస్తోంది. ఇదిగాక రాబోయే రోజుల్లో మన రక్షణ రంగానికి కనీసం వెయ్యికోట్ల డాలర్ల మేరకు ఆయుధాలను విక్రయించాలని చూస్తున్నారు. ఒకసారి అమెరికా ఆయుధాలు మన మిలిటరీకి వస్తే తరువాత కొనసాగింపుగా విడిభాగాలు, కొత్తవాటి కోసం మనమే అమెరికా వెంటబడాల్సి ఉంటుంది. ఇవన్నీ కళ్లముందు కనిపిస్తున్నాయి గనుకనే తన తొలి విదేశీ అతిథిగా మన ప్రధాని మన్మోహన్‌సింగ్‌కు గతేడాది ఒబామా ఆహ్వానం పలికారు.

★

బంధం

- గోనుగుంట మురళీకృష్ణ

భవన నిర్మాణం జరుగుతోంది. కార్మికులు ఆడా, మగా అందరూ కలిసి వరుసగా నిలబడి పనిచేస్తున్నారు. ఒకరు కాంక్రీటు నింపిన బొచ్చె విసిరేసినట్లు అందిస్తున్నారు. మరొకరు దాన్ని ఒడుపుగా పట్టుకుని పక్కవారికి అందిస్తున్నారు. నిచ్చెనమీద నిలబడ్డవారు కూడా పైఅంతస్తు మీద ఉన్నవారికి అందిస్తున్నారు. బొచ్చెల చైను లాగా వెళ్ళి పోతున్నారు. ఆ పని సునాయాసంగా, అలవోకగా చేస్తున్నారు. చేస్తూనే మధ్య మధ్య కబుర్లు చెప్పుకుంటున్నారు.

"ఒసేయ్ యాదీ! నీ పిల్లోడు ఏటి సేస్తున్నాడు?" అడిగింది రత్తమ్మ.

"నిద్రోతున్నాడొదినా!" అన్నది యాదమ్మ.

"పొద్దుట తింటానికి ఏటి పెట్టావు?"

"అర్రూపాయెట్టి అరిటికాయ కొన్నాను. అదెట్టాను"

"ఏటోనే ఆడికీ, నీకూ బందం" అన్నది రత్తమ్మ.

యాదమ్మకి ఆరు నెలలక్రితం జరిగిన సంఘటన గుర్తొచ్చింది.

యాదమ్మతో పాటు మరో పాతిక కుటుంబాలు ఉన్నాయి. వాళ్ళకి చెప్పుకోవడానికి సొంత ఊరు ఉంది కానీ, ఎక్కువగా వలసలు వెళుతుంటారు. ఎక్కడ పని దొరికితే అక్కడ నెలల తరబడి ఉండిపోతారు. పని చూపించిన వారే ఉండటానికి ఏ గొడ్లపాకలో, గుడారాలు వేసుకోవడానికి కావలసిన సామగ్రో ఏర్పాటు చేస్తారు. ఆ పనులన్నీ మురామేస్త్రీ చూస్తుంటాడు.

ఆరోజు యాదమ్మ కూరలు తెచ్చుకోవటానికి మార్కెట్‌కి వెళు తోంది. దారిలో గవర్నమెంట్ హాస్టల్ వెనక ఉన్న చెత్తకుండీ దగ్గర జనం మూగి ఉన్నారు. చెత్తకుండీలోంచి పసిబిడ్డ ఏడుపు వినపడుతోంది. అందరూ దూరంగా నిలబడి చోద్యం చూస్తున్నారు.

యాదమ్మ ఆ పిల్లాడిని తీసుకువచ్చి పాలు పట్టింది. పిల్లాడు ఏడుపు మానాడు. యాదమ్మకి ఆ పిల్లాడిని ఎవరికి అప్పగించాలో, ఏం చేయాలో తెలియలేదు. తన దగ్గరే ఉంచేసుకుంది. రెండు నెలలు గడిచాయి. పిల్లాడు యాదమ్మని గుర్తుపట్టటం, బోసి నవ్వులు నవ్వటం, కేరింతలు కొడుతూ కాళ్ళూ, చేతులు ఆడించటం చేస్తున్నాడు.

యాదమ్మ ఒకరోజు పిల్లాడికి స్నానం చేయించి, వంటి నిండా పౌడర్ కొట్టి, ఒళ్ళో వేసుకుని ఆడిస్తోంది. చుట్టు పక్కల ఇళ్ల వాళ్ళు చూడటానికి వచ్చారు.

"సందమామ లాగున్నాడు. ఏ తల్లి కన్నబిడ్డో?" అన్నది రత్తమ్మ.

"నువ్వే సాక్కోయే యాదీ!" అన్నది మరొకామె.

"మీ ఆయన పేరెట్టుకోయే!" సరసమాడాడు సింహాచలం.

"సీ! తాగుబోతు సచ్చినోడు. బతికున్నన్నాళ్లూ తాగొచ్చి నన్ను గొడ్డును బాదినట్టు బాదేవాడు. నేను ఆ ఇంటో, ఈ ఇంటో పాచిపని చేసి తెచ్చుకున్న డబ్బులు కూడా లాక్కొని తాగేవాడు. ఆడి జిమ్మడ"

మొగుడు గుర్తొచ్చి మెటికలు విరిచింది యాదమ్మ.

"పోనీ మీ అయ్య పేరెట్టుకోయే!" అంది ఒకామె.

"మా అయ్య నాకేటి సేసినాడేటి? తన బారం దించుకోటానికి తాగుబోతోడికి కట్ట బెట్టాడు"

"నీ కూతురంటే నీకు పానం గందా! దాని పేరు కలిసేట్టు ఎట్టుకో!"

"పజ్జెనిమిదేల్లు పెంచిన తల్లిని ఇడిసి ఎవుడితోనో లేచిపోయింది. పాడుముండ" అన్నది యాదమ్మ.

యాదమ్మకి వాళ్ళ సలహాలు ఏవీ నచ్చలేదు. పిల్లాడిని "బాబూ!" అని పిలిచేది. క్రమక్రమంగా అదే స్థిరపడిపోయింది. అందరూ "బాబూ!" అనే పిలిచేవాళ్ళు. బాబుకి ఆరు నెలలు వచ్చాయి. పారాడటం నేర్చుకుంటున్నాడు. యాదమ్మ ఆలోచిస్తూనే పని చేస్తోంది.

సాయంత్రం అయింది. పనివాళ్ళు అందరూ పనులు చాలించి, బోరింగ్ దగ్గర కాళ్ళూ, చేతులూ కడుక్కుంటున్నారు.

కొద్ది దూరంలో వాళ్ళు తాత్కాలికంగా గుడిసెలు ఏర్పాటు చేసుకున్నారు. ఆరు బయట ప్రదేశం అవటం వలన గాలి ధారాళంగానే వస్తోంది. యాదమ్మ చెట్టుకు వేసిన ఉయ్యాల దగ్గరికి వెళ్ళింది. అప్పటికే బాబు నిద్ర లేచి, తలవైపు గుడ్డ లాక్కొని తొంగి చూస్తున్నాడు. యాదమ్మ పిల్లాడిని ఎత్తుకుని తన గుడిసె దగ్గరకు వచ్చింది.

మూడు ఇటుక రాళ్ళు తెచ్చి, పొయ్యి ఏర్పాటు చేసి కుండలో అన్నం వండుతోంది. బాబు మట్టిలో పొర్లాడుతూ ఆడుకుంటున్నాడు.

కత్తిపీట ముందు పెట్టుకుని వంకాయలు తరుగుతోంది యాదమ్మ.

"ఏమే యాదీ! ఈ పూట నన్ను బోయినానికి పిలవరాదేటే?"

అరుగుమీద కూర్చుంటూ నవ్వుతూ అన్నాడు సింహాచలం.

యాదమ్మ వాడి వంక కొరకొరా చూసి సమాధానం చెప్పకుండా ఊరుకుంది.

అక్కడి మగవాళ్ళు మోటు సరసం ఆడటం తప్ప చెడుబుద్ధులు లేవు. అయినా యాదమ్మకి అది కూడా చీదరే! "అల్లతో నాకేటి? మాట్టాడకుండా ఉంటే సరిపోతుంది" అనుకుంటుంది.

జీవితంలో ఎక్కువగా చేదునే చవి చూసింది యాదమ్మ. కన్నెపిల్లగా ఉన్నప్పుడు రంగురంగుల చీరలు కట్టుకోవాలనీ, జడ నిండా మల్లెపూలు పెట్టుకోవాలనీ, మొగుడితో కలిసి సైకిలెక్కి చిరంజీవి సినిమా

చూడాలనీ కలలు కనేది. ఆ కోరికలు గ్రహించే ప్రయత్నమైనా చేయలేదు తండ్రి. మొగుడు తాగొచ్చి చావగొట్టటమే తప్ప ఏనాడూ ప్రేమగా చూడలేదు. యాదమ్మకి మొగుడు బతికున్నప్పటి కంటే చచ్చిన తర్వాతే హాయిగా అన్పించింది.

"పీడా పోయింది. కూతురుతో సుకంగా ఉండొచ్చు" అనుకుంది. ఆ కూతురు పద్దెనిమిదేళ్ళు నిండకుండానే ఎదురింటి కాలేజీ కుర్రాడితో లేచిపోయింది. వాళ్ళిద్దరూ ఎక్కడున్నారో ఎవరికీ తెలియదు. దానితో యాదమ్మకి మనుషులమీదే నమ్మకం పోయినట్లయింది. ఎవరితోనూ ఎక్కువగా మాట్లాడదు. అంటీ ముట్టనట్లు వ్యవహరిస్తుంది.

మళ్ళీ ఇన్నేళ్ళ తర్వాత యాదమ్మ జీవితంలోకి బాబు ప్రవేశించాడు. బాబు ఆకలయితే ఆపకుండా ఏడ్చేస్తాడు. అరటి పండో, బ్రెడ్డు ముక్కో పెడుతుంది. పని లేక పస్తు ఉండాల్సినప్పుడు కూడా ఎవరినీ అడగటానికి మనస్కరించదు. సీమ చింతకాయలు కోసి పప్పులు తినిపిస్తుంది బాబుకి. తను మంచినీళ్ళు తాగి కళ్ళు మూసుకుని పడుకుంటుంది.

యాదమ్మ అటు ఇటూ తిరుగుతూ పని చేసుకుంటూనే ఆలోచిస్తుంది. అన్నం వండటం అయిపోయిన తర్వాత బాబుకి పెట్టి, తను కూడా తిని ఈతాకుల చాప మీద నడుం వాల్చింది.

పడుకుందే కానీ నిద్ర పట్టడం లేదు. ఈ రోజు ఎందుకో ఆలోచనలు వదలడం లేదు. ఆనాడు తను ఆనాలోచితంగా బాబు బాధ్యత నెత్తిన పెట్టుకుంది. అందరిలాగే "నాకెందుకు?" అని పట్టించుకోకుండా

వెళ్ళిపోతే బాగుండేది. వాడిని పోషించటం రానురానూ మోయలేనంత భారంగా ఉంది. వాడు ఆకలయితే ఒక్కక్షణం కూడా ఆగడు. ఏదైనా పెట్టేదాకా ఏడుస్తూనే ఉంటాడు.

ఒక ఊరినుంచి మరొక ఊరు మారేటప్పుడు మరీ కష్టం. ట్రంకు పెట్టె, చాప నెత్తిన పెట్టుకుని వాడిని ఎత్తుకుని నడవాలి. బాబు పెద్దవుతున్నాడు. అంత బరువుతో, చెప్పుల్లేని కాళ్ళతో నడవాలంటే రాళ్ళు గుచ్చుకుంటూ ఉంటాయి. పోనీ వాడిని కిందకి దింపి నడిపిద్దామంటే బుల్లి బుల్లి అడుగులతో నడిచేలోపు అందరూ దూరమైపోతారు.

సంవత్సరం గడిచిపోయింది. ఈ లోపు యాదమ్మ విస్తళ్ళ కంపెనీలో ఇస్తళ్ళు కుడుతూ కొన్నాళ్ళు, స్కూలు పనులు చేసి కొన్నాళ్ళు, పైపు లైన్లు వేసే చోట మట్టిపనులు చేసి కొన్నాళ్ళు గడిపింది. ప్రస్తుతం ఖాళీగా ఉంది. ఎంత కాయ కష్టం చేసినా ఏపూటకాపూట సరిపోయేది. మిగుల్చుకున్నది ఏమీ లేదు. బాబుకి రెండేళ్ళు నిండాయి. చిన్న చిన్న మాటలు మాట్లాడుతున్నాడు.

యాదమ్మకి రెండు రోజుల నుంచీ జ్వరం. చేయటానికి పని కూడా లేదు. గంజి కాచుకోవటానికైనా ఇంట్లో నూకలు లేవు. బాబు పొద్దుటి నుంచీ ఆకలికి ఏడుస్తున్నాడు. ఎంత సముదాయించినా ఆపటం లేదు. ఇక భరించలేక వాడి వీపు మీద దబదబా రెండు దెబ్బలు వేసింది."సీపో! ఏడుపు గొట్టు మొకమోడా! నువ్వొచ్చిన కాడ నుంచీ నాకు కట్టాలే!" అన్నది.

బాబు ఏడుపు పెద్దది చేశాడు. యాదమ్మ కూడా ఏడ్చేసింది.

"ఊరుకోయే! ఆడికేం తెలుసు పసోడు" రత్తమ్మ పిల్లాడిని చంకనేసుకుని సముదాయిస్తూ బయటికి వెళ్ళింది.

పావుగంట తర్వాత తిరిగి వచ్చింది.

"యాదీ! ఆడ ఎవురో దర్మాత్ముడు అందరికీ మజ్జిగ ప్యాకెట్లు ఇత్తన్నాడు. నేను తాగి, బాబుకి ఓటి నీకోటి తెచ్చాను. లే! లేసి కూసో!" అన్నది. యాదమ్మ చేత మజ్జిగ తాగించింది.

కొంగున కట్టిన మందుబిళ్ళ నూరి, గ్లాసులో పోసి నీళ్ళతో గిలకొట్టి తాగించింది రత్తమ్మ.

"యాదీ! పెదపల్లి కాడ సినేమా ఆలు కడతన్నారంట. మేస్త్రీ సెప్పాడు. మనోళ్ళంతా రేపే ఎల్తన్నారు" అన్నది.

యాదమ్మ ముఖంలో ఆశ పొడసూపింది. ఈ పని దొరికితే రెండు మూడు నెలలు గడిచిపోతుంది. మజ్జిగ తాగిన తర్వాత కొంచెం తేరుకుంది. ఈ వార్త విన్న తర్వాత ఇంకొంచెం ఓపిక వచ్చినట్లయింది. లేచి తల దువ్వుకుని జడ వేసుకుంది.

రైల్వేస్టేషన్ కిటికిటలాడుతోంది. తోపుడు బండ్ల మీద టీలు, బిస్కట్లు అమ్మేవాళ్ళు పెద్దగా అరుస్తూ వెళుతున్నారు. యాదమ్మ తోటి పనివాళ్ళందరూ మూట, ముల్లె, తట్ట, బుట్ట పెట్టుకుని ప్లాట్‌ఫారం మీద కూర్చున్నారు. బాబు అక్కడి హడావిడి అంతా కొత్తగా, ఆసక్తిగా చూస్తున్నాడు. యాదమ్మ వాడివంకే ఆలోచనగా చూసింది.

తను దూర కంత లేదు. మెడకో డోలు అన్నట్లుంది. వీణ్ణి పోషించటం తన వల్ల కాదు. తనేమైనా వాడిని కన్నదా? కన్నోళ్ళే విడిచిపెట్టిపోయారు. వాళ్ళకి లేనిది తనకెందుకు? ఇక్కడే విడిచి వెళ్ళిపోతే సరి!

యాదమ్మ ఆలోచిస్తోంది. రైలు వచ్చింది. అందరూ ఎవరి సామాను వాళ్ళు రైల్లోకి ఎక్కిస్తున్నారు. బాబు అటువైపుకు తిరిగి చూస్తున్నాడు.

రైలు బయలు దేరుతున్నట్లుగా కూత వేసింది. యాదమ్మ తన బుట్ట తీసుకుని నాలుగడులు వేసింది. వెనక నుంచీ బాబు "అమ్మా" అని పిలిచాడు.యాదమ్మ వెనక్కి తిరిగి చూసింది. వాడు వచ్చేస్తున్నాడు. రైలు కదిలింది. వడివడిగా నడిచి బుట్ట రైల్లోకి తీసి ఎక్కేసింది.

బాబు "అమ్మా" అని పిలుస్తూ పరుగెత్తుకుంటూ వస్తున్నాడు.

యాదమ్మ కాళ్ళకి ఏదో బంధం అడ్డుపడ్డట్లయింది. లోపలికి వెళ్ళలేక డోర్ దగ్గరే నిలబడిపోయి చూస్తోంది.

రైలు వేగం పెరిగింది. అభం శుభం తెలియని రెండేళ్ళ పసివాడు "అమ్మా! అమ్మా!" అని అరుస్తూ ప్లాట్‌ఫారం అంచున పరుగెత్తుతూ, రైలు పట్టుకోవటానికి ప్రయత్నిస్తున్నాడు. యాదమ్మ గుండె దడదడా కొట్టుకుంది. మనసులో ఏదో తిరగబడినట్టయింది. అసంకల్పితంగా ఒక్కసారిగా కిందకు దూకేసింది. పడబోయి, నిలదొక్కుకుని, పరుగెత్తుకుంటూ వచ్చి బాబుని గుండెకు హత్తుకుంది. బాబు ఆమె మెడ చుట్టూ చేతులు బిగించాడు.

బాబు రైలు పట్టుకోబోయి ప్లాట్‌ఫారం సందులో పడిపోతే ఇంకేమైనా ఉందా? తను జీవితంలో మనశ్శాంతిగా ఉండగలదా? బాబుకి ఇంత అన్యాయం చేసి తను బావుకునే దేముంది? తను బతికి ఎవరిని ఉద్ధరించాలి? యాదమ్మ కళ్ళ వెంబడి నీళ్లు కారుతున్నాయి.

"బాబూ! నిన్ను ఎవురు కన్నారో నాకు అనవసరం. ఎందుకు ఇడిసి ఎళ్ళారో నాకు అనవసరం. నువ్వు నా ఒళ్ళోకి వచ్చినప్పుడే నా బిడ్డవయ్యావు. ఎన్ని కట్టాలైనా పడతా కానీ నీకు అన్నేయం సెయ్యను. నువ్వు పెద్దయింతర్వాత నన్ను సూడక పోయినా పర్నేదు. నువ్వు సల్లగా ఉంటే అంతే సాలు" తనలో తను అనుకున్నట్టుగా అన్నది యాదమ్మ.

ఆమె గుండె దడదడా కొట్టుకుంటూనే ఉంది. ★

ఇప్పటికే బ్లాగులపైన అనేక కథనాలు వచ్చాయి. అయినా చాలామందికి బ్లాగ్ అంటే ఏమిటి? దానిని ఎలా క్రియేట్ చేసుకోవాలి? ఒకవేళ చేసుకున్నా... దాన్ని ఆకర్షణీయంగా ఎలా తీర్చిదిద్దుకోవాలి? రకరకాల సమాచారాన్ని బ్లాగ్‌లో ఎలా పెట్టుకోవాలి? అనే విషయాలు తెలియవంటే అతిశయోక్తి కాదు. ప్రస్తుతం ఇంటర్నెట్‌లో తెలుగు బ్లాగుల హవా నడుస్తోంది. ఈవారం బ్లాగింగ్ బాతాఖానీ...

బ్లాగింగ్ బాతాఖానీ...!

కె.ఎక్స్.రాజు

మన ఆలోచనలు, దినచర్యలాంటివి నమోదు చేయడానికి వాడే పుస్తకాన్ని డైరీ అని పిలుస్తాం. ఇంటర్నెట్ ద్వారా అందుబాటులో వుండే అటువంటి సమాచారం కలిగిన వెబ్‌పేజీని బ్లాగ్ అంటారు. ఒకే వ్యక్తి ప్రచురించే పత్రికగా కూడా అర్థం చేసుకోవచ్చు. డైరీలో వ్యక్తిగత అభిప్రాయాలు, భావాలు రాసుకున్నట్లుగానే బ్లాగ్‌లోనూ రాసుకుంటాము. బ్లాగ్‌లో ఎప్పటికప్పుడు తాజా సమాచారాన్ని చేర్చడం కోసం చేసే ప్రక్రియను బ్లాగింగ్ అంటారు. ఈ పని చేసేవారిని బ్లాగర్ అంటారు. బ్లాగింగ్ అనేది బ్లాగ్‌కు సంబంధించిన అన్ని రకాల పనులకు ఉద్దేశించి వాడే పదం. ఎప్పటికప్పుడు బ్లాగ్‌లో సమాచారాన్ని వుంచే ప్రక్రియను నిర్దిష్టంగా చెప్పాలంటే పోస్టింగ్ అంటారు. డేటా, ఇమేజెస్, వీడియో, ఆడియో తదితరాలన్నీ ఈ కోవలోకే వస్తాయి. ఈ బ్లాగ్‌లను పరిశీలిస్తే విలక్షణమైన సమాచారం మనకు కనబడుతుంది. వ్యక్తిగత అభిప్రాయాలు, కవితలు, కథలు దగ్గర నుండి తాజా వార్తలు, విశేషాల వరకు వుంటాయి. అంతేకాదు... ఇతరులతో చెప్పుకోలేనివి బ్లాగులో పంచుకుంటారు. ప్రేమ, విరహం, బాధ, ఆరాధన, ఆవేదన, ద్వేషం అన్నీ ఇందులో కనిపిస్తాయి. ముఖ్యంగా తెలుగులో ఇప్పుడిప్పుడే ప్రముఖ రచయితలు, సాహితీవేత్తల బ్లాగులతోపాటు సాంకేతిక విజ్ఞానాన్ని పంచే బ్లాగులు కూడా దర్శనమిస్తున్నాయి. ఇవేకాదు! కుట్లు- అల్లికలు, వంటవార్పు దగ్గర నుండి సినిమాలు, సాంకేతిక విషయాల వరకూ అనేక బ్లాగులున్నాయి.

ప్రారంభం

బ్లాగ్ ప్రారంభించాలనుకున్నప్పుడు ముందుగా మనం ఏ అంశానికి సంబంధించి బ్లాగ్‌ను పెట్టదలచుకున్నామో.. దానికి అనుగుణంగా శీర్షిక (టైటిల్) ఆలోచించి పెట్టుకోవాలి. దీన్ని తెలుగులో కూడా పెట్టుకోవచ్చు. ఈ టైటిల్‌కు అందమైన ట్యాగ్‌లైన్ కూడా జతచేయవచ్చు. దీనిలో ముఖ్యమైంది బ్లాగ్ అడ్రస్ (యుఆర్‌ఎల్)... మనం అనుకునే టైటిల్‌కి తగినట్లుగా బ్లాగ్ అడ్రస్ కూడా ఎంపిక చేసుకోవాలి. అందరికీ గుర్తుండేలా, సింపుల్‌గా వుండేలా చూసుకోవాలి.

ఇక అసలు విషయానికొస్తే... బ్లాగ్ ప్రారంభించాలంటే మనకో ఇమెయిల్ అడ్రస్ వుండాలి. యుఆర్‌ఎల్ అడ్రస్ దగ్గర www.blogger.com అని టైప్ చేసి ఎంటర్ ప్రెస్ చేస్తే... ఓపెన్ అయ్యే పేజీలో 'క్రియేట్ ఎ బ్లాగ్... గెట్ స్టార్ట్' అని వుంటుంది. 'గెట్ స్టార్ట్' బటన్‌పైన క్లిక్ చేస్తే 'క్రియేట్ గూగుల్ ఎకౌంట్' పేజీ అనే పేజీ వస్తుంది. దీనిలో ఇమెయిల్ ఐడి, పాస్‌వర్డ్, డిస్‌ప్లే నేమ్ తదితర అంశాలను పూర్తిచేసి కంటిన్యూ బటన్‌పై ప్రెస్ చేయాలి. తర్వాత వచ్చే పేజీ 'నేమ్ బ్లాగ్'. ఇందులో మన బ్లాగ్ టైటిల్, బ్లాగ్ యుఆర్‌ఎల్ ఇవాలి. బ్లాగ్ యుఆర్‌ఎల్ కింద 'చెక్ ఎవైలబిలిటీ'ని క్లిక్ చేయడం ద్వారా మనకు కావాల్సిన యుఆర్‌ఎల్ అందుబాటులో వుందో లేదో తెలుసుకోవచ్చు. ఆ తర్వాత కంటిన్యూ అంటే.. మూడో స్టెప్‌లోకి వెళతాం. అది 'చూజ్ టెంప్లేట్'. దీనిలో బ్లాక్ పేజీ నమూనాలో ఏ రంగులో కావాలో.. దాన్ని సెలెక్ట్ చేసుకొని చివరలోనున్న కంటిన్యూ బటన్ ప్రెస్ చేస్తే వచ్చే పేజీలో 'యువర్ బ్లాగ్ హేజ్‌బీన్ క్రియేటెడ్' అని వస్తుంది. ఆ చివరలో 'స్టార్ట్ బ్లాగింగ్' అనే బటన్‌పై క్లిక్ చేస్తే, డిస్‌ప్లే నేమ్‌లో మనం ఇచ్చిన టైటిల్‌తో ఒక కొత్త పేజీ కనిపిస్తుంది. ఇందులో మొదటి ఆప్షన్ పోస్టింగ్. ఈ పోస్టింగ్‌లో పైన కనిపించే టైటిల్ దగ్గర మనం పోస్టు చేసే సమాచారం యొక్క శీర్షికను టైప్ చేయాలి. దానికిందనే ఖాళీగా వున్న ప్రాంతంలో సమాచారం టైప్ చేసుకోవాలి. ఈ సమాచారం ఆకర్షణీయంగా పెట్టుకునేందుకు కావాల్సిన టూల్స్ కూడా ఈ బాక్స్‌లోనే లభ్యమవుతాయి. ఈ బాక్సుకు దిగువనున్న 'పబ్లిష్ పోస్ట్' అనే బటన్‌పై క్లిక్ చేస్తే మన సమాచారం బ్లాగ్‌లోకి వెళ్ళిపోతుంది. అందులో కనిపించే 'వ్యూబ్లాగ్'పై క్లిక్ చేస్తే మనం క్రియేట్ చేసుకున్న బ్లాగ్ పేజీ మనం పోస్టు చేసిన సమాచారంతో ఎంచక్కా కనిపిస్తుంది.

ఇంతవరకు ఎక్కువమంది చేస్తూనే వుంటారు. ఆ తర్వాత అసలు సమస్య మొదలవుతుంది. మనం క్రియేట్ చేసుకున్న బ్లాగ్ మనం ఒక్కరమే చూస్తే సరిపోతుందా! అందరికీ చూపాలనే ఆసక్తి ఎలాగూ వుంటుంది. అయితే దీనికో మార్గం వుంది. తెలుగు బ్లాగ్‌లన్నిటినీ ఒకేచోట చూసేందుకు వీలుకల్పించే కొన్ని సైట్స్ వున్నాయి. వీటినే అగ్రిగేటర్స్ అంటారు. కూడలి (http://koodali.org/), మాలిక (http://maalika.org/), జల్లెడ (http://www.jalleda.com/), హారం



(http://haaram.com/), తెలుగు బ్లాగర్స్ (http://www.telugubloggers.com/)...వీటిలో మన బ్లాగ్‌ను జతచేయమని వారికి ఓ రిక్వెస్ట్ మెయిల్ చేయాలి. అంతే...మన బ్లాగ్‌లో కొత్త పోస్టు చేసిన ప్రతిసారీ వీటిలో జత చేయబడతాయి. ఒక్కో అగ్రిగేటర్‌లో వెయ్యినుంచి మూడువేల వరకు బ్లాగులున్నాయి. బ్లాగ్‌లలోని సమాచారాన్ని బట్టి వీటిని కేటగిరీలుగా కూడా విభజించారు. మిగతా వివరాలు ఆ సైట్‌లోకి వెళ్ళి చూడొచ్చు.

అలంకరణ

బ్లాగ్ క్రియేట్ చేయడం, ఎక్కువమంది చూసే విధంగా అగ్రిగేటర్స్‌లో జత చేయడం వరకు బాగానేవుంది. ఎక్కువమంది చూసేటప్పుడు ఆ బ్లాగ్‌లో మంచి సమాచారం వుండాలి. అదేవిధంగా ఆకట్టుకునే విధంగానూ వుండాలి. సమాచారం అంటే రాసేస్తారనుకోండి.. మరి బ్లాగ్ ఆకట్టుకునే విధంగా వుండాలంటే కొన్ని ట్రిక్కులు చేయాల్సిందే. బ్లాగ్‌లోకి లాగిన్ అయిన తర్వాత డాష్‌బోర్డ్‌లో డిజైన్ అనే ఆప్షన్ వుంటుంది. దానిపై క్లిక్ చేస్తే పేజీ లేఅవుట్ కనిపిస్తుంది. దీని పైభాగంలో 'టెంప్లేట్ డిజైనర్' అనే ఆప్షన్‌పై క్లిక్ చేస్తే పేజీ రెండు భాగాలుగా కనిపిస్తుంది. పైభాగంలో టెంప్లేట్స్, బ్యాక్‌గ్రౌండ్, లేఅవుట్, అడ్వాన్స్ అనే ఆప్షన్స్ కనిపిస్తాయి. ఇందులో నుండి మనకు కావాల్సిన కలర్స్, ఫాంట్స్, బ్యాక్‌గ్రౌండ్స్ అన్నిటినీ మార్పులు చేసుకోవచ్చు.

డిజైన్‌లోనే ఎడిట్ హెచ్‌టిఎంఎల్ అనే మరో ఆప్షన్ వుంది. దీని ద్వారా మనం కోరుకున్న నమూనాలో బ్లాగ్‌ను తయారుచేసుకోవచ్చు. వందల కొంది బ్లాగ్ నమూనాలను అందించేందుకు రకరకాల సైట్లు వున్నాయి. వీటినే బ్లాగ్ టెంప్లేట్స్ అంటారు.

బ్లాగ్ టెంప్లేట్స్ అందించే కొన్ని సైట్లు

http://btemplates.com/
http://blogger-templates.blogspot.com/
http://www.ourblogtemplates.com/
http://eblogtemplates.com/
www.blogbulk.com/
http://www.deluxetemplates.net/
http://finalsense.com/
http://wpbloggerthemes.blogspot.co/
http://www.ipietoon.com/
http://www.bloggerstyles.com/

బ్లాగ్ టెంప్లేట్స్ అందించే సైట్లనుండి మనకు నచ్చిన టెంప్లేట్‌ను డౌన్లోడ్ చేసుకోవాలి. ఆ తర్వాత అది జిప్ ఫార్మేట్‌లో వుంటుంది. అది అన్‌జిప్ చేసి చూస్తే ఆ ఫోల్డర్ ఎక్స్‌ఎంఎల్ ఫైల్ ఒకటి కనిపిస్తుంది. దాన్నలా వుంచి ఎడిట్ హెచ్‌టిఎంఎల్ పేజీలో బ్యాకప్/రీస్టోర్ టెంప్లేట్ అనే ఆప్షన్‌లో "డౌన్లోడ్ టెంప్లేట్"పై క్లిక్ చేస్తే మన బ్లాగ్ మైడాక్యుమెంట్స్‌లో డౌన్లోడ్ అవుతుంది. ఇది ఎందుకంటే, పాత టెంప్లేటే కావాలంటే తీసుకునేందుకు ఉపయోగపడుతుంది. ఈ డౌన్లోడ్ కిందనే వున్న బ్రౌజ్ బటన్‌పై క్లిక్ చేస్తే ఫైల్ అప్‌లోడ్ చేసుకునేందుకు వీలుగా ఒక ప్యాలెట్ ఓపెన్ అవుతుంది. అందులో మనం డౌన్లోడ్ చేసుకున్న టెంప్లేట్‌లోని ఎక్స్‌ఎంఎల్ ఫైల్‌ను సెలెక్ట్ చేసుకొని అప్‌లోడ్ అనాలి. అప్పుడు ఒక మెసేజ్ చూపుతుంది.



పాత సెట్టింగ్స్ వుంచాలా తీసేయాలా? అని. పాత సెట్టింగ్స్ వుంచుకొని ఓకె అనాలి. ఆ తర్వాత వ్యూబ్లాగ్ అంటే కొంత టెంప్లేట్‌తో కొత్త బ్లాగ్ రెడీ.

మనం చేస్తున్న పోస్టింగ్స్ పెద్దగా వుంటే పేజీ లెంగ్త్ బాగా పెరిగిపోతుంది. పేజీ మొదటి నాలుగైదు వాక్యాల తర్వాత "రీడ్ మోర్" ఆప్షన్ వుంటే ఎంచక్కా మొదటి పేజీలో ఎక్కువ పోస్టింగ్స్ కనిపిస్తాయి. చదువుకునేందుకు కూడా అనువుగా వుంటుంది. మరి ఈ రీడ్ మోర్ ఆప్షన్ యాడ్ చేయాలంటే పోస్టింగ్ ప్యాలెట్ పైభాగంలో కనిపించే టూల్స్‌లో "ఇన్‌సెర్ట్ జంప్ బ్రేక్" అనే బటన్ వుంటుంది. బ్లాగ్ పేజీలో సమాచారం ఎన్ని వాక్యాలు చూపించాలనుకుంటామో, వాటి పక్కనే మౌస్ కర్సర్ వుంచి 'ఇన్‌సెర్ట్ జంప్ బ్రేక్' బటన్‌పై క్లిక్ చేసి, పబ్లిష్ పోస్ట్ అనాలి. అంతే బ్లాగ్ మొదటి పేజీలో మీరు ఎన్నిలైన్స్ చూపాలనుకుంటారో అంతే కనిపిస్తాయి.

అదేవిధంగా వీడియోస్ జత చేయాలనుకోండి. పైన చెప్పిన బటన్ పక్కనే "ఇన్‌సెర్ట్ వీడియోస్" అనే బటన్ వుంటుంది. దీని నుండి యాడ్ చేసుకోవచ్చు. అయితే ఈ ఆప్షన్ ద్వారా మన కంప్యూటర్‌లో వున్న వీడియోస్‌ను మాత్రమే యాడ్ చేసుకోగలుగుతాము. అయితే ఇప్పుడంతా ఏ రకమైన వీడియోలు కావాలన్నా దొరికే ప్రముఖమైన సైట్ 'http://www.youtube.com/'. దీనిలోనుండి యాడ్ చేసుకోవాలంటే- ఆ సైట్‌లోకి వెళ్ళి కావాల్సిన వీడియోను ఎంపిక చేసుకోవాలి. ఉదాహరణకు యూట్యూబ్ సెర్చ్‌లో 'మహాకవి శ్రీశ్రీ' టైప్ చేస్తే ఆయనకు సంబంధించిన వీడియోలన్నీ కనిపిస్తాయి. వాటిలో ఒకటి ఎంపిక చేసుకొని దానిపై క్లిక్ చేస్తే, ఆ వీడియో ఓపెన్ అవుతుంది. దాని కిందే 'ఎంబెడ్' అనే బటన్ వుంటుంది. ఆ బటన్‌మీద క్లిక్ చేస్తే ఆ వీడియోకి సంబంధించిన కోడింగ్ కనిపిస్తుంది. దాన్ని కాపీచేసుకొని - మన బ్లాగ్‌లోని డిజైన్‌లో 'యాడ్ ఎ గాడ్జెట్' అనే బటన్స్ కనిపిస్తుంటాయి. ఆ గాడ్జెట్స్‌లో ఒకటి ఎంపిక చేసుకొని క్లిక్ చేస్తే, ఆ గాడ్జెట్ ఫీచర్స్ కనిపిస్తాయి. దానిలో "హెచ్‌టిఎంఎల్/జావాస్క్రిప్ట్' అనే బటన్‌పై క్లిక్ చేయాలి. ఆ తర్వాత వచ్చే ప్యాలెట్‌లో యూట్యూబ్ నుండి కాపీ చేసుకున్న కోడింగ్‌ను పేస్ట్ చేసి, సేవ్ అనాలి. అంతే ఆ వీడియో మన బ్లాగ్‌లో కనిపిస్తుంది. ఆ వీడియో సైజును కూడా పెంచుకోవడం, తగ్గించుకోవడం చేయవచ్చు. అదే విధంగా ఆడియో కూడా యాడ్ చేసుకోవచ్చు.

వీటితోపాటు రకరకాల విడ్జెట్స్ నెట్‌లో అందుబాటులో వున్నాయి. వాటి ద్వారా ఫొటో స్లైడ్ షోలు, ఆర్ఎస్ఎస్ ఫీడర్స్, గడియారాలు, సైట్ స్టాటిస్టిక్స్ జతచేయవచ్చు. ఇక ఆలస్యం ఎందుకు! మీరూ ఓ బ్లాగ్ క్రియేట్ చేసి, మీకు నచ్చిన అంశాలను బ్లాగింగ్ చేయవచ్చు.

★

కనిపెట్టాలోచ్...

హాయ్ నేస్తాలూ... ఇక్కడ బోలెడన్ని పదాలున్నాయర్రా. అన్నీ మీరు స్కూల్లో ఉపయోగించేవే. మీకు బాగా తెల్సినవే. మొత్తం 20 పదాలు. అన్నీ ఆంగ్లంలోనే వున్నాయి. ఇంతకీ ఆ పదాలు ఏవంటే... Art, Paper, Books, Pen, Chalk, Pencil, Classroom, Quiz, Desk, Reading, Eraser, Recess, Exam, Student, Gym, Teacher, Learn, Test, Math, Writing. మరి చకచకా కనిపెట్టేయండే. చివరికి మా సమాధానంతో మీ జవాబు సరిచూసుకోండి.

R	K	C	H	A	L	K	P	P	V	G	P	V
T	H	T	A	M	K	R	P	T	Y	M	W	G
K	W	C	R	S	N	R	A	M	A	K	M	K
T	Y	C	E	P	E	N	P	X	V	G	O	K
K	H	D	L	G	B	D	E	G	F	N	O	D
T	V	N	K	O	E	G	R	Q	H	I	R	F
S	N	R	O	P	N	R	T	S	E	T	S	L
S	T	K	N	I	P	E	A	L	N	I	S	E
E	S	U	D	P	C	H	I	S	M	R	A	A
C	Z	A	D	B	B	C	Y	Z	E	W	L	R
E	E	I	K	E	N	A	L	T	X	R	C	N
R	H	Q	U	E	N	E	M	W	R	B	N	H

వీరి వీరి గుమ్మడి పండు

హాయ్ నేస్తాలూ...ఇక్కడ ఇద్దరు బుల్లి తారలు వున్నారు. వారెవరో చెప్పుకోండి చూద్దాం. తెలీదా! అయ్యో భలే వారే. వీరిద్దరూ బాలీవుడ్ హీరోలు. తండ్రీ కొడుకులు కూడా. ఏంటీ తెలిసిందా! తెలీలేదా! అయితే మా జవాబు చూడండి.



మనిషి కంటి చూపు కంటే కుక్క కంటి చూపు ఎక్కువ.



ఒంటె పాలు తోడుకోవడం గురించి ఎప్పుడైనా విన్నారా!



క్యాన్సర్ సోకని జీవి ఏదైనా వుందీ అంటే షార్క్ చేప మాత్రమే.



రెయిన్ డీర్‌కు ఇష్టమైన పండు ఏదో తెల్సా! అరటిపండు.



నీటి లోపల నడవగలరా! కానీ ఆర్మడిల్లా నడవగలదు!!

చుక్కలు కలిపేస్తే పోలా



జాలరి ఎక్కడున్నాడబ్బా...

బుజ్జాయిలూ... ఇక్కడ బొమ్మలో చేపలు మూడు వున్నాయా! అయితే వాటిని పట్టిన జాలరి కూడా ఇక్కడే ఎక్కడో వున్నాడంట. మరి మీరే అతన్ని గుర్తించాలి.

కవల పులులు

పిల్లలూ... ఆరు పులులు భలేగా పోజు పెట్టాయికదూ. చూడ్డానికి అన్నీ ఒకేలా వున్నాయి కూడా. కాకపోతే ఇందులో రెండు మాత్రమే కవలలు. మరి అవేవో కనిపెట్టి చెప్పండి.



గాలిపటాన్ని చేరేదెలా!





ఏమేం ప్రాణులు వున్నాయి?

ఇక్కడ ఓ విచిత్రమైన ప్రాణి కనిపిస్తోందికదా. అయితే అందులో మీకు బాగా తెలిసిన మూడు జీవుల శరీర భాగాలున్నాయి. ఇంతకీ అవేంటో చెప్పండి చూద్దాం.

కనిపెట్టాలోచ్:



మాటల కోట - 25

రూపకల్పన : వెంకట సుబ్బారావు కావూరి

1	2			3		4	5	6
7			8		9		10	
		11			12	13		
	14			15		16	17	
18			19				20	
	21	22				23		
24		25	26		27			28
29	30		31	32			33	
34						35		

అడ్డం :

1 వేడుక (3)
4. వెయ్యిరా చిన్నోడెయ్యిరా చిందు (3)
7. బంధించటం, పరిమితి విధించటం (2)
8. చెల్లాచెదురయిన తియ్యటన్నం (3)
10. పోవటం, వక్క (2)
11. రాదని చెప్పండి (2)
12. మొన్న కాదు, ఈరోజు కాదు. మధ్యలోది (2)
14. సంస్కృతం అమ్మ (2)
16. తెలుగు దోశ (2)
18. వేగంగా (2)
19. 15 నిలువుకు వ్యతిరేకం. స్నేహితుడు (3)
20. కోపం (2)
21. అటు నుంచి ఇటు సాగిన నోరు బయట భాగం (2)
23. యాత్ర, రెండో వైపు నుంచి కొత్తది అని (2)
25. ఇతరులది దారి మార్చింది (2)
27. తర్వాతది (2)
29. ఆంగ్ల పదం ఫైలుకు తెలుగు (2)
31. ఈశాన్యంలో మూడు పట్టణాలని పేరున్న వామపక్ష పాలిత రాష్ట్రం (3)
33. బెక బెక (2)
34. అలిగిందేమో ముఖం ఎటెటో పోయింది (3)
35. కనపడకుండా పోవటం (3)

నిలువు :

1. మొత్తం (3)
2. వెల్లడి (2)
3. రాముడి బాణానికి వాలిపోయినవాడు (3)
5. కింద నుంచి మొదలయిన యుద్ధం (2)
6. కరువు కకావికలమయింది (3)
8. పోరు నష్టం, ఇది లాభమని తెలుగు సామెత. స్నేహం, (2)
9. ఖనిజాలు ఉండే చోటు (2)
11. వ్రాత పలుకుబడి (2)
13. తమ్ముడు కాదు కింద నుంచి పైకొచ్చిన పెద్దోడు (2)
14. మన మాతృకే. రూ. 20 వేలకేనంటూ సంజయ్‌గాంధీ ఊరించిన వాహనం (3)
15. 19 అడ్డానికి వ్యతిరేకం, మన నాశనం కోరేవాడు (3)
17. దారి మార్చిన కుదువ, తనఖా (3)
22. పాతతరం కొలతల్లో జాన తర్వాత, పూలమాలను ఇలానే కొలుస్తారు (2)
23. కనికరం, దయ (2)
24. అవసరం కన్నా ఎక్కువ (3)
26. వినాయకుడిని దీంతో పూజిస్తారు. పత్ర సమూహం (2)
27. యంత్రం (2)
28. కింద నుంచి పెరిగిన చిల్లకంప (3)
30. దారి మార్చిన గుడ్డ, బట్ట (2)
32.పట్టణం (2)
33. కల్వం ... వికృతి. వలయం, పంట నూర్పిడికి అనువుగా తయారు చేసిన భూమి (2)

మాటలకోట - 24 జవాబు

1 ఆ	రు		2 ఆ	3 మ	ని		4 ద	5 చే
ద		6 ఆ		మ		7 ది		వ
8 రా	9 త్రి		10 ప	ద	వి		11 కు	రు
	12 పు	రం		చం		13 బ	టుం	
14 తా	ర		15 పా		16 పం		17 బ	స
	18 నే	త		19 బొ		20 పో	రా	
21 గ	ని		22 అ	మ్మ	మ్మ		23 వు	24 లా
బ్జి		25 ద్ర		రి		26 శ్రీ		వ
27 లం	క		28 అ	ల్లు	డు		29 పు	ణ్యం



వెరై'టీ' కప్పులు

అసలే వాతావరణం చల్లగా వుంది.
ఉదయాన్నే వేడివేడి టీ పడకపోతే
ఏం బావుంటుంది చెప్పండి. చికాకు,
కోపం... వగైరాలు చుట్టుముట్టేయవూ!
అదే గరమ్ చాయ్ మెల్లగా
గొంతులో దిగుతూ వుంటే...
కలిగే ఆనందం అంతా ఇంతా కాదు.
అదుగో సరిగ్గా అలాంటి
టీ ప్రియులకోసమే...ఈ వెరై'టీ 'కప్పులు.
బావున్నాయా! వీటిని చూడగానే
టీ చప్పరించేయాలనిపిస్తోందా!
మరి ఎందుకాలస్యం? కానిచ్చేయండీ!!
కాకపోతే ఇలాంటి కప్పుల్లోనే అంటే
కొంచెం కష్టం. అవి దొరకాలిగా మనకు!







divine dream homes
with a touch of luxury
SRINIVASAM
srinivasam
Kapula uppada, Vizag-Bheemili Beach Rd.
150 Duplex Houses with Club House.
CORPORATE OFFICE :
T.P.T. Colony, Near The Hindu,
Opp. Eenadu Rythu Bazar, Seethammadhara,
Visakhapatnam - 530 013.
Ph : 2703366, 2711499,2597236 (Fax),
www.svrgroup.com
SVR
PROPERTIES
SINCE 1999
Mob: 9908725294, 9963393777